





కలెక్టర్‌ను కలిసిన కొత్త ఎస్పీ.. బాధ్యతలు స్వీకరిస్తున్న నరసింహ కిషోర్

పారదర్శకంగా విధులు

- చట్టాన్ని ఉల్లంఘిస్తే ఉపేక్షించం
- నూతన జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ వెల్లడి

రాజమహేంద్రవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పారదర్శక విధి నిర్వహణతో ప్రజా సమస్యలకు తొలి ప్రాధాన్యం ఇస్తామని నూతన ఎస్పీ డి.నరసింహకిషోర్ వెల్లడించారు. బుధవారం అర్చకుని వేద మంత్రోచ్చారణ నడుమ కార్యాలయంలోకి ప్రవేశించి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సహకారంతో జిల్లాలోని పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంపొందించే విధంగా విధులు నిర్వర్తిస్తామన్నారు. జిల్లాలో అశాంతికి తావులేకుండా నేరాల అదుపునకు కృషి చేస్తామని, అలాగే గంజాయి, మాదకద్రవ్యాలు, నాటుసారా, మహిళలపై వేధింపులు వంటి సమస్యలపై ఉక్కుపాదం తప్పదన్నారు. అసాంఘిక వ్యక్తులు, పాత నేరస్తులు, రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. సాధారణ జనజీవనానికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కటకటాలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ.. బాధితులకు త్వరితగతిన సాంత్వన చేకూర్చే విధంగా పనిచేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తామని స్పష్టంచేశారు. తొలుతగా గౌరవ వందనాన్ని స్వీకరించారు. అడిషనల్ ఎస్పీ(పరిపాలన) రాజశేఖర్‌రాజు, ఎస్‌బీ డీఎస్పీ ప్రభాకర్, వివిధ జోన్ల డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.రఘురాం, ఉపాధ్యక్షుడు జె.సాయిమహేశ్ తదితరులు ఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ పి.ప్రశాంతిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఆయనకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. జిల్లాలోని శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్, ఎస్పీ చర్చించారు.

నీలగిరి కలెక్టరుగా తెలుగమ్మాయి

తాళ్లపూడి, జూలై17: తమిళనాడులోని నీలగిరి (ఊటీ) జిల్లా కలెక్టరుగా తెలుగమ్మాయి బాధ్యతలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామానికి చెందిన తన్నీరు సాయి, ఝాన్సీరాణి దంపతుల కుమార్తె తన్నీరు లక్ష్మీభవ్య నీలగిరి జిల్లా కలెక్టరుగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. లక్ష్మీ భవ్య రాజమండ్రి ట్రిప్స్ ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో చదివారు. భీమవరం విష్ణు కాలేజీలో ఇంజనీరింగ్‌చేసి 2015లో 88వ ర్యాంకుతో ఐఏఎస్‌కు ఎంపికై వెస్ట్‌బెంగాల్‌లో సబ్‌కలెక్టరుగా జాయిన్ అయ్యారు. తర్వాత తమిళనాడు రాష్ట్రంలో ఈరోడ్, తిరుపూర్, కరూర్ మూడు జిల్లాలకు జాయింట్ కమిషనర్‌గా పనిచేసి ఇప్పుడు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆమె భర్త సుంకర రాజ్‌గోపాల్ కూడా తమిళనాడులోని ఈరోడ్ జిల్లా కలెక్టరుగా పనిచేస్తున్నారు. తమ గ్రామానికి చెందిన యువతి నీలగిరి జిల్లా కలెక్టరుగా బాధ్యతలు చేపట్టడం పట్ల అన్నదేవరపేట టీడీపీ యువగళం సభ్యులు కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, తొండెపు భరత్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

పిచ్చి బ్రాండ్లు.. నష్టమెంత?

- జగన్ మద్యం.. వందల పుస్తెలు మింగేసింది
- సర్వేలో వెలుగు చూస్తున్న భయంకర నిజాలు
- జే బ్రాండ్లతో కుటుంబాలు చిన్నాభిన్నం
- కిడ్నీ ఖతం.. గుండె గతితప్పి.. నాడీ వ్యవస్థ నిర్వీర్యమై..
- ఏళ్ల తరబడి అలవాటు ఉన్నా.. గత ఐదేళ్లలో బలి



జగన్ పిచ్చి బ్రాండ్లు వందలాది మంది ప్రాణాలను హరించేశాయనే నిజం ఇప్పుడు ప్రకంపనలు రేపుతోంది. తన పుస్తెలను నకిలీ, నాసిరకం మద్యమే మింగేసిందని బాధిత మహిళలు ఆనాడు ఎంత రోదించినా పట్టించుకునే పాలకులు లేకపోయారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో నాసిరకం మందు కాటుకు కుటుంబాలు చిన్నాభిన్నం కావడం నిజమేననే విషయం ఇప్పుడు బయటపడుతోంది. చాలా ఏళ్ల నుంచీ మద్యం అలవాటు ఉన్నా గత ఐదేళ్లూ నెట్టుకురాలేక జే బ్రాండ్ల గరళానికి బలైపోయిన వాళ్ల సంఖ్య జిల్లాలో వందల్లో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. వైసీపీ హయాంలో విషాన్ని మద్యం రూపంలో అధికారికంగా అమ్మేశారనేది ప్రధాన ఆరోపణ. ఏపీలో మద్యం అంటేనే ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవాళ్లు భయపడిపోయేవాళ్లు. కిడ్నీలు పాడై, గుండె గతితప్పి, నాడీ వ్యవస్థ నిర్వీర్యమై, ఉదర సంబంధిత వ్యాధులు ఎక్కువై మంచాన పట్టిన వారు ఎందరో ఉన్నారు. ఇప్పుడు ఇవన్నీ వెలుగు చూస్తున్నాయి. జిల్లాలో ఇంకా కొనసాగుతున్న ఓ సర్వే జగన్ చేసిన పాపానికి ఎప్పటికీ ప్రాయశ్చిత్తం లేదనే వాస్తవాన్ని మౌనంగా వెల్లడిస్తోంది. ఇంటి యజమానులు జగన్ పిచ్చి బ్రాండ్లకు బలైపోగా, జీవచ్ఛవాల్లా బతుకులీడుస్తున్న కుటుంబాలు లెక్కకు మించి ఉన్నాయని తేలుతోంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కడియం మండలం బుర్రిలంకకు చెందిన ఒక వ్యక్తికి చీప్ లిక్కర్ అలవాటు ఉంది. ఎప్పటినుంచో మద్యం అలవాటు ఉన్నా జే బ్రాండ్ల మద్యం వల్ల ఆకలి ఉండేది కాదు. దీంతో రెండు నెలల పాటు మద్యమే ఆహారమైంది. తర్వాత నెమ్మదిగా నీరసపడగా వైద్యుడు కిడ్నీ పరీక్ష చేయించారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని తేలింది. ఈలోపు శరీరంపై చర్మం మాత్రమే మిగిలింది. కల్తీ మద్యానికి చివరికి బలైపోయాడు.

రాజమహేంద్రవరానికి చెందిన ఒక వ్యక్తి బంధువుది కోనసీమ జిల్లా. చాలా ఆరోగ్యంగా ఉండేవాడు. అతడికీ ఎప్పటి నుంచో మద్యం అలవాటు ఉంది. కానీ జగన్ మద్యం వచ్చిన తర్వాత లివర్ పాడైపోయింది. మనిషి జీవచ్ఛవంగా మారిపోయాడు. దీంతో హైదరాబాద్ తీసుకెళ్తే రూ.40 లక్షలు ఖర్చవుతుందని.. బతుకుతాడని నమ్మకం లేదని వైద్యులు చెప్పారు. దీంతో అతడిని వెనక్కి తీసుకొచ్చేశారు. నాలుగు రోజుల తర్వాత ఈ నాసిరకం మద్యానికి ప్రాణాలు కోల్పోయాడు.

- జగన్ హయాంలో మద్యానికి, విషానికి పెద్దగా తేడా ఉండేది కాదనే ఆరోపణలు వినవస్తుండేవి. కొన్ని బ్రాండ్లను కొందరు చెన్నైలోని ఓ ప్రధాన ల్యాబ్‌లో పరీక్షలు చేయిస్తే ఏపీలో విక్రయించే మద్యంలో విషపదార్థాలు ఉన్నాయని బయటపడింది. కానీ ఆనాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. మద్యం తయారీ ఫ్యాక్టరీ (డిస్టిలరీ)లను వైసీపీ నాయకులు చెరబట్టి నాసిరకం మద్యం తయారు చేసేవాళ్లు. నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా 'గాలి'కి వదిలేశారు. ప్రాణాంతకమైన మిథనాల్ వంటి రసాయనాలు, స్పిరిట్ వంటివి ఎక్కువగా కలపడం వంటివి చేసేవాళ్లని ఆరోపణలు ఉన్నాయి. దీంతో మద్యం అలవాటు ఉన్నవాళ్లు రకరకాల రుగ్మతల బారినపడడం జరిగేది. పూటకో బ్రాండుతో మద్యంబాబుల ప్రాణాలతో చెలగాటం ఆడేవాళ్లు. ఒకరోజు కనిపించిన బ్రాండు మరుసటి రోజున కనిపించేది కాదు. దీనిలోనూ చాలా మతలబు ఉండేది. ఈరోజు తయారుచేసిన బ్రాండు అమ్మకాలకోసం నిన్న తయారు చేసిన బ్రాండును ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టేసేవారు. బార్‌కి వెళ్లి కొనాలంటే రూ.70-90 అదనంగా వదిలించుకోవాలి. అప్పటికే జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మద్యం ధరలను విపరీ

తంగా



పెంచేసింది. దీంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో దొరికే మద్యాన్నే గొంతులో పోసుకోక తప్పేది కాదు. అది వేగంగా ఆరోగ్యాన్ని హరించేసేది. ఇదంతా అధికారులకు తెలిసినా దారుణం వెనుక వైసీపీ నాయకులు ఉండడంతో ఏమీ చేయలేక చేష్టలుడిగి విధులు నిర్వర్తించక తప్పేది కాదు. దీంతో ఇటు చీప్ లిక్కర్, అటు నాటుసారా తాగి పేదలు ఎక్కు వగా ప్రాణాలు విడిచేవారు.

ఎంతమంది బలైపోయారు?

జగన్ పిచ్చి బ్రాండ్లకు ఎంతమంది బలైపోయారనే విషయాన్ని నిగ్గుతేల్చడానికి ఓ ప్రక్రియ మొదలైంది. ఆనాటి ప్రభుత్వ మద్యం తాగి చనిపోవడం వల్ల రోడ్డున పడిన వాళ్లను ఎంతోకొంత ఆదుకుందామనే ఉద్దేశంతో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి చొరవతో వైద్యారోగ్యశాఖ వద్ద వివరాలను కోరగా ఫలితం లేకపోయింది. దీంతో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), పేదల నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో సర్వే చేయించారు. లోతైన విశ్లేషణ, నిర్ధారణ కోసం ఇంకా సర్వే కొనసాగుతోంది. మద్యం అలవాటు ఎప్పటి నుంచి ఉంది? చనిపోయే సమయానికి ఆయనకు ఎలాంటి వ్యాధులు ఉన్నాయి? అనే ప్రశ్నలు వేస్తున్నారు. 2019 నుంచి 2024 వరకూ వితంతువులు అయిన వారి ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించే ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో 64,795 మంది వితంతు పింఛనుదారులు ఉన్నారు. వారిలో ఇప్పటివరకూ సుమారు 7వేల మంది తమ భర్తలు మద్యం అలవాటు వల్ల 2019-2024 మధ్య చనిపోయారని చెప్పారు. వీళ్లలో జగన్ కల్తీ మద్యానికి బలైపోయిన వారు చాలామంది ఉంటారని తెలుస్తోంది. వాస్తవిక సమాచారం కోసం మరింత లోతైన పరిశీలన జరుగుతోంది. ఇప్పటివరకు అందిన గణాంకాల్లో రాజమహేంద్రవరం అర్బన్ మొదటి స్థానంలో ఉండగా, గోకవరం రెండో స్థానంలో ఉంది. సర్వే పూర్తయిన తర్వాత వైద్యులతో నిర్ధారణ, క్రోడీకరణ తర్వాత ఓ అంచనాకు రానున్నారు.

అప్పట్లో బెల్టులు వందల్లో..

మద్యం ఆదాయంపై నెట్టుకొచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వం టార్గెట్లు పెట్టి మరీ ఎక్సైజ్ శాఖను ఒత్తిడి చేసేది. తద్వారా జనాలతో పూటుగా తాగించేది. తూర్పుగోదావరి జిల్లాలోని 19 మండలాల్లో 158 మద్యం దుకాణాలు చాలవన్నట్టుగా వాక్‌ఇన్ స్టోర్స్‌ని మొదలు పెట్టింది. వీటికి వందల్లో బెల్టుషాపులు జతకలిశాయి. వీటిని వైసీపీ నాయకులు, లేదా వారి అండతో వేరొకరు నడిపేవాళ్లు. 2014-2019 మధ్య మందు కావాలంటే ప్రభుత్వం లైసెన్సు ఇచ్చిన షాపునకు వెళ్లి కొనుక్కోవాల్సిందే. కానీ 2019లో జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత గడప గడపకూ కల్తీ మందు అందాలన్నదే లక్ష్యంగా నిబంధనలనకు నీళ్లొదిలేసింది. సారా ఏరులై పారినా వదిలేసింది. వైసీపీ హయాంలో సారా విక్రయాలు కూడా విపరీతంగా పెరిగాయి. చాలాచోట్ల సారా దుకాణాలు బెల్టుషాపులుగా రూపాంతరం చెందాయి. పైగా అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కూడా మద్యం లభ్యమయ్యేది. గత ఏడాది ఓసారి కేవలం రెండు రోజుల్లో పోలీసులు గోదావరి లంకల్లో ఏకంగా 6 వేల లీటర్ల బెల్లపు ఊట స్వాధీనం చేసుకున్నారు. మరోచోట 4 వేల లీటర్ల సారాను ధ్వంసం చేశారు. అంత పెద్దఎత్తున తయారవుతున్న సారా ఊళ్లలోకి వచ్చి చేరేది. ఒకవైపు వైసీపీ ప్రభుత్వ నాణ్యత లేని మద్యం వల్ల ఆరోగ్యాలు నాశనమవుతుంటే సారా మరింత ఆజ్యం పోసేది. ఇవన్నీ కలిసి కుటుంబాలను రోడ్డున పడేసేవి.

మేం రెడీ!

- మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఎప్పుడు ప్రకటించినా ఓకే
- జిల్లాలో 285 ఆర్టీసీ బస్సులు
- ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక



రాజమహేంద్రవరంఅర్బన్, జూలై 17: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు ప్రకటించినా అమలుచేసేందుకు జిల్లా ఆర్టీసీ యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఆగస్టు నెలలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అమలుచేస్తామంటూ ఇప్పటికే రవాణాశాఖ మంత్రి సంకేతాలు పంపిన నేపథ్యంలో జిల్లా ఆర్టీసీ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈమేరకు ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిలా అశోక ఒక రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ రూట్‌మ్యాప్‌ను అమలుచేయనున్నారు. అయితే ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంతవరకూ తమకు గైడ్‌లైన్స్ రాలేదని షర్మిల అశోక స్పష్టంచేశారు. జిల్లాలో రాజమహేంద్రవరంతో పాటు గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోల్లో మొత్తం 285 వరకూ ఆర్టీసీ బస్సులున్నాయి. వీటిలో 206 సొంత బస్సులు కాగా, 79 అద్దె బస్సులు నడుపుతున్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు సర్వీసులకు సంబంధించి మొత్తం 129 ఆర్టీసీ బస్సుల్లో 126 సొంత బస్సులు, మూడు అద్దె బస్సులు ఉన్నాయి. సొంత బస్సులకు సంబంధించి పల్లెవెలుగు 126, అల్ట్రా పల్లె వెలుగు మూడు బస్సులు నడుపుతున్నారు. అద్దె బస్సులు 66 ఉంటే, 44 పల్లెవెలుగు సర్వీసులుగాను, 22 అల్ట్రా పల్వెవెలుగు సర్వీసులుగాను తిప్పుతున్నారు. అలాగే ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) ప్రతిరోజూ సుమారు 72 నుంచి 74 శాతం వరకూ ఉంటుంది. ఇందులోనూ సుమారుగా 50 శాతం మందికి పైగా మహిళలే ప్రయాణాలు చేస్తుంటారని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఆర్టీసీ సర్వీసులు నడపడం ద్వారా జిల్లా ఆర్టీసీకి రోజుకు రూ.36 లక్షల నుంచి రూ.38 లక్షల వరకూ ఆదాయం సమకూరుతోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి వస్తే ఈ ఆదాయంలో ఎంతమేర కోత పడుతుందనేదానిపై ఆర్టీసీ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే విధానపరమైన నిర్ణయం తర్వాతనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనున్నారు.

జిల్లా సరిహద్దులపై గందరగోళం

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం జిల్లాకే పరిమితమా లేక రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లి రావచ్చా అనేది చర్చనీయాంశంగా ఉంది. దీనిపై ప్రభుత్వం ఇంకా గైడ్‌లైన్స్ రూపొందించలేదు. అయితే చాలామంది మాత్రం జిల్లా పరిధిలోనే ఉచిత బస్సు సౌకర్యం అమలు చేస్తారనే ప్రచారం సాగుతోంది. దీంతో జిల్లా సరిహద్దులు ఏమిటనే దానిపై చర్చ సాగుతోంది. కొత్తగా ఏర్పడిన తూర్పుగోదావరి జిల్లాకు ఇటు గండేపల్లి, అనపర్తి, గోకవరం, సూరంపాలెం, అటు నల్లజర్ల, పెరవలి సరిహద్దులుగా ఉన్నాయి. దీంతో ఈ సరిహద్దుల వరకే ఉచిత ప్రయాణం అనుమతిస్తారా లేక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోనూ ఉచిత ప్రయాణం ఉంటుందా అనే మీమాంస కొనసాగుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరిలో కాకినాడ, తుని, అమలాపురం, రంపచోడవరం, మారేడుమిల్లి, చింతూరు, సీలేరు వరకూ పరిధి ఉంది. జిల్లాల విభజన తర్వాత జిల్లా పరిధిని కుదించారు. కాకినాడ, అమలాపురం కొత్త జిల్లాల్లోకి వెళ్లిపోయాయి. జిల్లాల విభజన తర్వాత పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న కొవ్వూరు, నిడదవోలు, తాళ్లపూడి గోపాలపురం, నల్లజర్ల వంటి మండలాలను కొత్తగా తూర్పుగోదావరిలో కలిపారు. ఈ పరిస్థితుల్లో ఆర్టీసీ ఉచిత ప్రయాణానికి సంబంధించి పాత జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుంటుందా లేక కొత్త జిల్లా ఒక యూనిట్‌గా ఉంటుందా? దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. కాగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదని ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేయడానికి తాము తగిన ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.



మున్సిపల్ సిబ్బందిని విచారిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, అధికారులు

దేవతా వృక్షం నరికివేతపై విచారణ

- పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్
- 'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందన
- నిర్లక్ష్యం వహించిన సిబ్బందిని సస్పెండ్ చేయాలని కమిషనర్‌కు ఆదేశం

కొవ్వూరు, జూలై 17: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో 120 సంవత్సరాల చరిత్ర కలిగిన దేవతా వృక్షాన్ని(రావిచెట్టును) నరికివేసిన సంఘటనలో బాధ్యులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'చెట్టంత కష్టం' వార్తకు మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి, కమిషనర్ కె.డానియేల్‌జోసఫ్‌లు సిబ్బందితో గోష్పాదక్షేత్రాన్ని సందర్శించారు. మున్సిపల్ సిబ్బంది, స్థానిక పురోహితులు, చెట్టు నరికిన కాంట్రాక్టర్‌ను విచారించారు. అయితే చెట్టును నరికివేయడంలో మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది, స్థానిక పురోహితులు తాము నరకమని చెప్పలేదంటే, తాము చెప్పలేదని ఒకరికి ఒకరు వాదులాడుకున్నారు. బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ కమిషనర్‌కు ఈ ఉదంతానికి సంబంధించి ఫొటోలను పంపినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ తన సెల్‌ఫోన్‌లో 150 వాట్సాప్ గ్రూపులు ఉన్నాయని, చూడలేదని బదులు ఇవ్వడంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. చైర్‌పర్సన్ రత్నకుమారి మాట్లాడుతూ గోష్పాదక్షేత్రంలో దేవతా వృక్షం కొమ్మ వర్షానికి విరిగి పడిందని, కొమ్మను తొలగిస్తున్నామని తమకు ఎటువంటి సమాచారం లేదన్నారు. అంతేగాకుండా చెట్టు మొదలు వరకు నరికివేశారని, దీనిపై ప్రశిస్తే ఒకరిపై ఒకరు తప్పించుకునే ధోరణి ప్రదర్శిస్తున్నారన్నారు. గోష్పాదక్షేత్రంలో విధులు నిర్వహిస్తూ చెట్టు నరికివేస్తున్నా నిర్లక్ష్యం ప్రదర్శించిన సిబ్బందిని అవసరమైతే సస్పెండ్ చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. కమిషనర్ డానియేల్ జోసఫ్ మాట్లాడుతూ చెట్టు నరికివేతపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే, దీనిపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.



నన్నయ ఇన్‌చార్జి ఉపకులపతి ఎవరో?

దివాన్‌చెరువు, జూలై17: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతిగా ఎవరిని నియమిస్తారన్న విషయమై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నన్నయ విశ్వవిద్యాలయం వీసీ పదవికి ఆచార్య కె.పద్మరాజు గతనెల 30వ తేదీన చేసిన రాజీనామాను గవర్నర్ ఆమోదించారు. అయితే వెనువెంటనే పూర్తి వీసీని నియమించే వీలు లేకపోవడంతో ఇన్‌చార్జి వీసీ బాధ్యతలను ఎవరికి అప్పగిస్తారనే విషయం ఆసక్తికరంగా మారింది. సాధారణంగా ఏ విశ్వవిద్యాలయంలోనైనా వీసీ పదవి ఖాళీ అయిన సందర్భంలో ఆయా వర్సిటీ రెక్టారుకో, సమీప విశ్వవిద్యాలయం వీసీకో అదనపు బాధ్యతలు అప్పగించడం లేదా ఐఏఎస్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించడం జరుగుతుంటుంది. అయితే ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాల వీసీలు తమ పదవులకు రాజీనామాలు చేశారు. దీంతో ప్రత్యేకాధికారిని నియమిస్తారేమోనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నన్నయ విశ్వవిద్యాలయానికి రెక్టార్ లేనందున సీనియర్ ఆచార్యుడికి వీసీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తారన్న అభిప్రాయం కూడా ఉంది. నూతన వీసీ నియామకం కోసం నోటిఫికేషన్ జారీ, సెర్చ్ కమిటీ ఏర్పాటు, దరఖాస్తుల ఆహ్వానం, పరిశీలన వంటి ప్రక్రియలు పూర్తి అయ్యేందుకు కనీసం మూడు నెలల వ్యవధి పట్టవచ్చునని విద్యావేత్తలు అంటున్నారు. అంతవరకూ నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ఏలుబడిలోనే కొనసాగకతప్పదని తెలుస్తోంది. దీంతో నన్నయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న కొంతమంది సీనియర్ ఆచార్యులతోపాటు గతంలో ఇక్కడ పనిచేసి ప్రస్తుతం ఆంధ్రావిశ్వవిద్యాలయంలో బాధ్యతలు నిర్వహిస్తున్న ఒకరిద్దరు ఆచార్యులు ఇన్‌చార్జి వీసీ పదవికి తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నట్టు సమాచారం.

ఏడిఏ కార్యాలయం హుకుంపేటకు మార్పు

రాజమహేంద్రవరం రూరల్, జూలై17: రాజమహేంద్రవరం సబ్‌డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకుల కార్యాలయం రూరల్ మండలం హుకుంపేటలోని రైతు సేవా కేంద్రానికి బుధవారం మార్చినట్టు ఏడిఏ డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇప్పటివరకు ఈ కార్యాలయం రాజానగరం మండలం పరిధిలోని దివాన్ చెరువులో ఉండేది. ఇక్కడ రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, కడియం మండలాలను చెందిన వ్యవసాయ సిబ్బంది హుకుంపేటలో అందుబాటులో ఉంటారు. వ్యవసాయానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామంటున్న ప్రభుత్వాలు వ్యవసాయశాఖ కార్యాలయానికి సొంత భవనం విషయం మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయానకి చేరువలో భవన నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. గత ప్రభుత్వం హయాంలో కనీసం ఆ ఊసే లేదు. దీంతో గత పదేళ్లుగా అద్దె భవనాల్లోనే పలుచోట్ల ఈ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.



గౌతమి గ్రంథాలయంలో పురాతన గ్రంథాలు పరిశీలిస్తున్న కలెక్టర్

'గౌతమి'కి పూర్వ వైభవం తీసుకువద్దాం

నగరంలో ముఖ్య ప్రదేశాలను పరిశీలించిన కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, జూలై17: రాజమహేంద్రవరంలోని పలు ముఖ్యమైన ప్రదేశాలను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం పరిశీలించారు. ఇందులో భాగంగా గౌతమి గ్రంథాలయాన్ని పరిశీలించారు. గ్రంథాలయంలో ఉన్న పురాతన గ్రంథాలు, వాటి విశిష్టతను లైబ్రేరియన్ ఐ.శ్రీదేవి కలెక్టర్‌కు వివరించారు. తొలుత రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయానికి పూర్వవైభవం తీసుకువద్దామన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధంచేస్తే ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. అనంతరం దామెర్ల ఆర్ట్ గ్యాలరీని కలెక్టర్ పరిశీలించారు. అక్కడ ఉన్న తైలవర్ణ చిత్రాలను తిలకించారు. గ్యాలరీకి సంబంధించిన వివరాలను గ్యాలరీ ఇంచార్జి నాగేశ్వరరావు వివరించారు. అనంతరం టౌన్ హాలును పరిశీలించారు. 2027లో జరిగే పుష్కరాల నాటికి రాజమహేంద్రవరంలో పర్యాటకపరంగా దర్శనీయ స్థలాలు గుర్తించి, వాటి గుర్తింపు కోసం క్షేత్రస్థాయిలో పర్యటించి అధ్యయనం చేయడం జరుగుతుందని కలెక్టర్ చెప్పారు.

శోకతప్త హృదయాలతో..

మొహర్రం సందర్భంగా రక్తం చిందించిన ముస్లింలు

మాతం నిర్వహించి అమరవీరులకు నివాళులు



నగరంలో మాతం నిర్వహిస్తున్న ముస్లింలు



మొహర్రం సందర్భంగా పీర్లు ఊరేగిస్తున్న ముస్లిం భక్తులు

మామిడికుదురు, జూలై 17: కర్బలా పుణ్యభూమిలో అసువులు బాసిన ఇమామ్ హుస్సేన్, అతని 72 మంది పరివారానికి రక్త తర్పణం చేస్తూ ముస్లింలు నిండు శోకంతో బుధవారం మొహర్రం నిర్వహించారు. ఇమామ్ హుస్సేన్ అమరత్వం పొందిన రోజులను పురస్కరించుకుని ముస్లిం భక్తులు కత్తులు, బ్లేడులు, గొలుసులతో హుస్సేన్ హుస్సేన్ అంటూ తమ శరీరాన్ని గాయపరుచుకుని రక్తం చిందిస్తూ మాతం నిర్వహించి వారికి ఘన నివాళులర్పించారు. మొహర్రాన్ని పురస్కరించుకుని నగరం, మామిడికుదురు గ్రామాల్లో 40 పంజాల నుంచి పీర్లు, గుమ్మటాలను గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ నిండు శోకంతో ఇమామ్ హుస్సేన్ అతని పరివారానికి అంజలి ఘటించారు. మత ప్రబోధకుడు సయ్యద్ అలీజాఫరీ పవిత్ర యుద్ధ భూమిలో ఇమామ్‌హుస్సేన్, అతని పరివారం మరణించిన తీరును భక్తులకు వివరించగా భక్తులు గుండెలు బాదుకుంటూ కన్నీరు మున్నీరుగా విలపించారు. నగరం మంజిలే కర్బలా నుంచి పెదపంజీష వరకు రక్తం చిదిస్తూ మాతం నిర్వహించారు. పెదపంజీషలో ఇమామ్‌హుస్సేన్, అతని పరివారం అమరత్వం పొందిన సంఘటనను మజ్లిస్ రూపంలో వివరించి అనంతరం షహదత్ మజ్లిస్ జరిగింది. అనంతరం నగరంలోని పీర్ల చెరువులో పీర్లను శాంతింప చేశారు. మొహర్రం కార్యక్రమంలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొని గుమ్మటాన్ని మోసి పీర్లను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. రాష్ట్రం నలుమూలలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు అంజుమానే హుస్సేనీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.



ద్రాక్షారామలో మాతం నిర్వహిస్తున్న ముస్లింలు

నిండు శోకంతో..

ద్రాక్షారామ,జూలై 17: రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో బుధవారం మొహర్రంను ముస్లింలు నిండుశోకంతో జరుపుకున్నారు. మహమ్మద్ ప్రవక్త మనుమడు హజరత్ ఇమాం హుస్సేన్ సంతాపదినాలు బుధవారం సాయంత్రంతో ముగిసాయి. ఈనెల 7న నెలవంక దర్శనంతో సంతాప దినాలు ప్రారంభించారు. 11 రోజుల పాటు ముస్లింలు సంతాప దినాలు నిండు శోకంతో జరుపుకున్నారు. త్యాగాలను స్మరించుకుంటూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇమాం హుస్సేన్ వీరమరణం పొందిన రోజైన మొహర్రం రోజు ఉదయం ముస్లింలు ప్రత్యేక నమాజ్ చేశారు. పెద్ద మసీదు సెంటర్ నుంచి హజరత్ అబ్బాస్ రోడ్డు వరకు అమరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ తమ వీపుపైన చాతిపైన, శిరస్సుపైన గాయాలు చేసుకుని మాతం(రక్తతర్పణం) చేసి ఇమాం హుస్సేన్‌పై భక్తిని చాటుకున్నారు. మొక్కుబడులు సమర్పించారు. పీరులను చెరువు వద్దకు తీసుకువెళ్లి కడిగి శాంతింపచేశారు. కర్ణాటక నుంచి వచ్చిన అష్టర్ అబేది సాహెబ్ మజ్లిస్ బోధించారు. మంగళవారం రాత్రి తల్లి పీరు ఊరేగింపు ప్రధాన ఘట్టంగా జరిగింది.



ముత్యాలమ్మతల్లికి సారె సమర్పణ

కడియం, జూలై 17: వేమగిరి గ్రామస్థుల ఆడపడుచుగా, గ్రామదేవతగా, భక్తుల పాలిట కల్పవల్లిగా పూజలు అందుకుంటున్న ముత్యాలమ్మ వారికి ఆషాఢమాసం సందర్భంగా బుధవారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముత్యాలమ్మ దిబ్బ మీద ఉన్న ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, 200 కిలోల స్వీట్లు సమర్పించారు. పురవీధుల గుండా అమ్మవారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

ఇద్దరు యువకుల అరెస్టు

రాజమహేంద్రవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో బాలికను లొంగదీసుకొని శారీరక వాంఛ తీర్చుకున్న యువకుడితో పాటు అతడికి సహాయం చేసిన స్నేహితుడిని కూడా టూటౌన్ పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మూరు పరిధిలో నివసిస్తున్న ఓ కుటుంబంలోని 15 ఏళ్ల బాలిక పదో తరగతి చదువుతోంది. నాలుగు నెలలుగా ప్రేమ పేరుతో తూము ముత్యాలరావు(ముత్యాలు) అనే యువకుడు వెంటపడుతున్నాడు. పరిచయం ఏర్పడి ఇన్‌స్టాగ్రాంలో చాటింగ్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో బయటికి వెళ్దామంటూ ఆ బాలికను ఒప్పించాడు. ఈ నెల 15న స్కూలు నుంచి ఆ బాలికను స్నేహితుడు గుత్తుల వీరబ్రహ్మం(వీరబాబు)తో కలిసి బైక్‌పై వేమగిరిలోని తన ఇంటికి తీసుకెళ్లారు. వీరబ్రహ్మం వెళ్లిపోగా..ఆ బాలికకు మాయమాటలు చెప్పి ముత్యాలు లొంగదీసుకొని శారీరక వాంఛ తీర్చుకున్నాడు. సాయంత్రం ఆమెను ఇంటి సమీపంలో వదిలి వెళ్లాడు. బాలిక ప్రవర్తనలో మార్పును గమనించి తల్లిదండ్రులు ప్రశ్నించగా అఘాయిత్యం బయట పడింది. వారు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని సీఐ తెలిపారు. పోక్సో కేసు నమోదు చేసి ముత్యాలుతో పాటు అతడికి సహకరించిన వీరబ్రహ్మాన్ని అరెస్టు చేశామని.. సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ పేర్కొన్నారు. 2021లో ఒక హత్యా నేరం కేసులో ముత్యాలు బెయిల్‌పై ఉన్నాడన్నారు. అతడిపై రాజానగరం పోలీస్‌స్టేషన్లో రౌడీషీట్ కూడా ఉందని డీఎస్పీ వివరించారు.

అధ్యాపకునిపై పోక్సో కేసు

అడ్డతీగల, జూలై 17: అడ్డతీగల ప్రభుత్వ జూనియర్ కళాశాల కామర్స్ అధ్యాపకునిపై పోక్సో ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు అడ్డతీగల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. అదే కళాశాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్న విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడనే ఆరోపణ రావడంతో కేసులు నమోదు చేశామన్నారు. తనను వేధిస్తున్నట్లు సదరు విద్యార్థిని స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిందన్నారు. దీనిపై చింతూరు ఏఎస్పీని విచారణ అధికారిగా జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ నియమించినట్లు సీఐ తెలిపారు.

నిలకడగా ఆర్.నారాయణమూర్తి ఆరోగ్యం

రౌతులపూడి, జూలై 17: సినీ నటుడు ఆర్.నారాయణ మూర్తి ఆరోగ్యం నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు రోజులు నుంచి హైదారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసి బంధువులు, అభిమానులు నారాయణ మూర్తి సొంత గ్రామం మల్లంపేట చేరుకుని ఆయన ఆరోగ్యంపై వాకబు చేస్తున్నారు. దీంతో సోదరుడు రెడ్డి బుల్లాబ్బాయి మాట్లాడుతూ ఆర్.నారాయణమూర్తి పేగు సంబంధిత సమస్యతో ఆసుపత్రిలో ఉన్నారని ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు



మహావిష్ణువుకు పూజలు

సామర్లకోట, జూలై 17: ఆషాఢమాసం తొలి ఏకాదశి మహాపర్వదినం సందర్భంగా పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని మహావిష్ణువు, లక్ష్మీదేవి అమ్మవార్లకు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేద పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, వెంకన్న, శ్రీనివాసరావు, వినయ్ విశేష అభిషేక పూజలు నిర్వహించారు. పుష్పార్చన పూజలు అనంతరం స్వామి వారిని, అమ్మవారిని నూతన పట్టువస్త్రాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో దేవదాయ శాఖ నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకంలో సుమారు 600 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయం వెలుపల గల భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో సుమారు 500 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

బైక్‌పై నుంచి పడి నాలుగేళ్ల బాలుడి మృతి

మరో ఇద్దరికి తీవ్రగాయాలు

రెండు కుటుంబాల్లో పెను విషాదం

దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం



రియాన్స్ మృతదేహం



రియాన్స్ (ఫైల్‌ఫొటో)

కరప, జూలై 17: దైవదర్శనానికి వెళ్లి ఆనందంగా తిరిగొస్తున్న ఆ రెండు కుటుంబాల్లో రోడ్డు ప్రమాదం పెను విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో నాలుగేళ్ల బాలుడు మృతిచెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కరప మండలం వేళంగి-కూరాడ రోడ్డులో రైల్వే ట్రాక్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన ఈ దుర్ఘటనకు సంబంధించి కరప పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రావుల పాలెం మండలం ఎదురేశ్వరం గ్రామానికి చెందిన కర్రి సూర్యభాస్కర్‌రెడ్డి ఫైనాన్స్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు గ్రామంలో ఇటీవల ప్రతిష్ఠించిన వారాహి అమ్మవారిని దర్శించుకునేందుకు బుధవారం అతని భార్య అలేఖ్య, కుమారుడు రియాన్స్(4), సోదరి కర్రి ధనలక్ష్మి, ఆమె కుమారుడు 15 ఏళ్ల స్వప్నిత్‌రెడ్డిలతో కలిసి రెండు ద్విచక్ర వాహనాలపై బయలుదేరారు. వారాహిమాత దర్శనం ముగించుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. కూరాడ రైల్వే గేటు దాటాక మోటర్‌సైకిల్ డ్రైవ్ చేస్తున్న కర్రి ధనలక్ష్మి తాటి దుంగలు లోడుతో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేసింది. అయితే వర్షం పడి బురదతో నిండిన గొయ్యిని తప్పించబోయి ఆమె బండితో సహా రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో ఇదే బండిపై ఉన్న సోదరుడి కుమారుడు రియాన్స్ తలకు తీవ్రగాయం కాగా, ధనలక్ష్మి, ఆమె కుమారుడు స్వప్నిత్‌రెడ్డిలకు నడుము, రిబ్స్, చేతులు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. రియాన్స్‌ను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. క్షతగాత్రులు ధనలక్ష్మి, స్వప్నిత్‌రెడ్డిలు కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కళ్ల ముందు కొడుకు మృతిచెందడంతో తట్టుకోలేని సూర్యభాస్కర్‌రెడ్డి, అలేఖ్య దంపతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కరప ఎస్ఐ తూపాటి రామకృష్ణ ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. అలాగే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల వద్దకు వెళ్లి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వివరించారు.

లోవ దేవస్థానంలో విశేష పూజలు



లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం



లక్ష తులసి అర్చన



ఆలయంలో ఎమ్మెల్యే బుచ్చిబాబు

తుని రూరల్,జూలై 17: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని తొలి ఏకాదశి పర్వదినాన అమ్మవారికి విశేష పూజాధి కార్యక్రమాలను ఆలయ పండితులు నిర్వహించారు. ఆలయంలో ముందుగా కైలాస గణపతి స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. లక్ష్మీగణపతి హోమం నిర్వహించి ప్రధాన ఆలయంలో తలుపులమ్మ అమ్మవారికి లక్ష తులసి పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో పి.విశ్వనాథరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు.

తలుపులమ్మ అమ్మవారి సేవలో ముమ్మిడివరం ఎమ్మెల్యే

ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ దేవస్థానంలో ముమ్మడివరం శాసన సభ్యులు దాట్ల సుబ్బారాజు (బుచ్చిబాబు) అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా పూజలు అనంతరం ఆలయ పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆయనకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

నేటి నుంచి డీఎల్‌ఎంటీలకు శిక్షణ తరగతులు

సామర్లకోట, జూలై 17: గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రభుత్వ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో డీఎల్‌ఎంటీలకు ఈ నెల 18 గురువారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం విలేకరులతో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులు తొమ్మిది రోజుల పాటు జరుగుతాయన్నారు. ఒక్కో బ్యాచ్‌కు మూడు రోజులు చొప్పున రెసిడెన్షియల్ పద్ధతిన శిక్షణా తరగతులు నిర్వహించనుండగా 11 జిల్లాల నుంచి మూడు బ్యాచ్‌లుగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మూడు బ్యాచ్‌లుగా విభజించి నిపుణులు శిక్షణ ఇస్తారని ఈ సందర్భంగా చెప్పారు. జిల్లాలో వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు ఈ శిక్షణా తరగతులకు హాజరై వివిధ అంశాలను వివరిస్తారని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ చెప్పారు.

కలెక్టర్ మాధవీలత అక్రమాలపై విచారణ జరపాలి

రాష్ట్ర ప్రభుత్వానికి బర్రే ఆనంద్ కుమార్ ఫిర్యాదు



మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 17: తూర్పుగోదావరి జిల్లాకు తొలి కలెక్టర్ గా పనిచేసిన డాక్టర్ మాధవీలత ఒక కలెక్టర్‌గా కాకుండా వైసీపీ కార్యకర్తగా విధులు నిర్వర్తించడంతో ఆమె అవినీతి అక్రమాలపై కూటమి ప్రభుత్వం విచారణ జరపాలని స్వతంత్ర జనా(రిపబ్లిక్) పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బర్రే ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన మాధవీలత చేసిన అవినీతి, అక్రమాలపై సీఎంకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. రాజానగరం మండలంలో శ్రీకృష్ణపట్నంలో సుమారు 89 ఎకరాల సీలింగ్ భూమి ఉందని అది నిరుపేదలకు చెందాల్సిన భూమి అని సుప్రీంకోర్టు సైతం తీర్పు ఇచ్చిందని అయినప్పటికి ఆ సర్వే నెంబర్లను బ్లాక్‌లో పెట్టడం తప్ప అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని , తక్షణమే ఆ భూమిని ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకొని పేదలకు పంచాలని 2022 జూన్ 6వ తేదీన కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌కి వెళ్లి ఆధారాలతో సహ ఫిర్యాదు చేశానని చెప్పారు. అయితే కలెక్టర్ ప్రభుత్వ సీలింగ్ భూములను కేవలం వారం రోజులకే ప్రైవేటు వ్యక్తి ధారాదత్తం చేసే విధంగా మొత్తం సర్వే నెంబర్లను బ్లాక్‌లో నుంచి తీయించేశారని ఆరోపించారు. పేదలకు చెందాల్సిన ప్రభుత్వ భూములు కొంత మంది ప్రైవేటు వ్యక్తులు అమ్ముకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసిందని అందువల్ల తక్షణమే విచారణ చేయాలని కోరుతున్నామన్నారు. విస్సాకోటి శ్రీను, విజ్జిన వీర్రాజు, కొత్తపల్లి మహేష్, విజ్జిన రాంబాబు, డేగపాటి ప్రశాంత్ కుమార్, వేమవరపు రాజు, కాకి హనుమంతరావు, వందే లక్ష్మణరావు పాల్గొన్నారు.

పాదగయలో నందీశ్వరునికి పూజలు



నందీశ్వరునిపై ఉత్సవమూర్తులు కొలువైన దృశ్యం

పిఠాపురం, జూలై 17: కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో కొలువై ఉన్న నందీశ్వరునికి బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. తొలిఏకాదశి సందర్భంగా నందీశ్వరుడికి పుష్పాలు, వస్త్రాలతో విశేష అలంకారం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను నందీశ్వరునిపై ఆశీనులు చేశారు. భక్తులు నందీశ్వరుని చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనరు దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో ఎస్పీ పూజలు



ఎస్పీకి ప్రసాదం అందిస్తున్న పీఆర్వో కృష్ణారావు

అన్నవరం, జూలై 17: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో కాకినాడ జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన విక్రాంత్ పాటిల్ బుధవారం స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో మనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేయగా పీఆర్వో కృష్ణారావు స్వామివారి ప్రసాదం అందించారు.

రత్నగిరిపై తొలి ఏకాదశి రద్దీ



క్యూలో వేచి ఉన్న భక్తులు

అన్నవరం, జూలై 17: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిదిలో బుధవారం తొలి ఏకాదశి పర్వదినం, ప్రభుత్వ సెలవు దినం కావడంతో భక్తులతో రద్దీ నెలకొంది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలనుంచి స్వామిని దర్శించి వ్రతాలు ఆచరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ఉచిత దర్శనానికి మూడు గంటల సమయం భక్తులు వేచి ఉన్నారు. బుధవారం ఒక్కరోజు సుమారు 3 వేల వ్రతాలు జరగగా వివిధ విభాగాల ద్వారా రూ.35 లక్షలు ఆదాయం సమకూరింది.

పెరుగుతున్న గోదావరి

ధవళేశ్వరం,జూలై 17: ఉపనది ఇంద్రావతి నుంచి వరద ప్రవాహం గోదావరిలో కలుస్తూ ఉండటంతో భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. దీంతో ఎగువ నుంచి వచ్చి చేరే ప్రవాహాన్ని అంచనా వేస్తూ కాటన్ బ్యారేజ్ గేట్ల ద్వారా 93244 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తూ గోదావరి బేసిన్‌ను ఖాళీ చేస్తున్నారు. బుధవారం సాయంత్రానికి ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.65 అడుగులుగా నమోదయింది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 3 వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1700 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4 వేల క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు.

భారీ కొండచిలువ హతం



జగ్గంపేట రూరల్,జూలై 17: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలంలోని కాండ్రేగుల గ్రామంలో కామర కొండపై 15 అడుగుల కొండ చిలువను మేకల కాపర్లు హతమార్చారు. గ్రామానికి చెందిన కొంత మంది కామర కొండపై మేకలు మేపుతుండగా అకస్మాత్తుగా కొండచిలువ ఒక మేకను చుట్టుకుని తినేందుకు ప్రయత్నించింది. మేకల అరుపులు విన్న మేకల కాపర్లు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి చూడగా మేకను మింగేందుకు కొండ చిలువ మేకను చుట్టుముట్టింది. ఇది గమనించిన స్థానికులు మేకల కాపర్లు ఆ కొండ చిలువను కత్తులతో హతమార్చారు. మేక కొండచిలువ దాడిలో చనిపోయింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చూసేందుకు అధిక సంఖ్యలో వచ్చారు.

27న ఎస్సీ, ఎస్టీ సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ, జూలై 17: భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాలు, ప్రాథమిక విధులపై అందరికీ అవగాహన కల్పించేందుకు ఈనెల 27న కాకినాడలోని డీ కన్వెన్షన్ హాల్‌లో 17వ రాష్ట్రస్థాయి ఎస్సీ, ఎస్టీ సదస్సు నిర్వహిస్తామని అంబేడ్కర్ ఆలోచనా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ప్రముఖ న్యాయవాది పినిపే వెంకటరామకృష్ణ తెలిపారు. కాకినాడ ఇంద్ర పాలెం లాకుల వద్దగల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించి సదస్సు పోస్టర్ ఆవిష్క రించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లకు దగ్గర వుతున్నా దళిత, గిరిజన ప్రజలు పూర్తిస్థాయిలో అంబేడ్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలు పొంద లేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా స్వామ్య వ్యవస్థలో దళిత, గిరిజన సామాజికవర్గాల ప్రాధాన్యం సంపాదించుకునేలా అంబేడ్కర్ ఆలోచనా ఫౌండేషన్ పదేళ్లుగా విశేష కృషి చేస్తో ందన్నారు. ఈ సదస్సుకు రాష్ట్ర వ్యాప్తంగా న్యాయ మూర్తులు, న్యాయవాదులు, విశ్రాంత వైద్యనిపుణులు, సమాజం పట్ల అవగాహన కలిగి మార్పుకోసం తపించే వివిధ రంగాల ప్రముఖులు హాజరుకానున్నారని ఏఏఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటరామకృష్ణ తెలిపారు. దళిత సత్తా నాయకులు బచ్చల కామేశ్వరరావు, పిల్లి శివకుమార్ పాల్గొన్నారు.

అదుపు తప్పిన ఐషర్ వ్యాన్

డ్రైవర్ మృతి

ప్రత్తిపాడు, జూలై 17: ప్రత్తిపాడు పాదాలమ్మ తల్లిగుడి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐషర్ వ్యాన్ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తుని నుంచి రాజమండ్రి వైపు వస్తున్న ఐషర్ వ్యాన్ స్థానిక పాదాలమ్మ తల్లి గుడి వద్దకు రాగానే అదుపు తప్పి గోతులో పడి కాలువలోకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో బొమ్మూరుకు చెందిన డ్రైవర్ బొంతు నాగేశ్వరరావు(49)కు తలకు బలమైన గాయాలు కావడంతో వ్యాన్‌లోనే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి ఎస్ఐ ఎం.పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పొల్లూరు జలపాతం వద్ద పర్యాటకుల సందడి

మోతుగూడెం,జూలై 17: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జలపాతం ఉరకలేస్తూ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. ఏజెన్సీ వ్యాప్తంగా విస్తృతంగా వర్షాలు కురవడంతో జలపాతం ఉరకలేస్తుంది. సుమారు 50 అడుగులు పై నుంచి వేగం నీటి ప్రవాహం కిందకు పడుతుంది. దీంతో పర్యాటకులు జలపాతం వద్ద సరదాగా గడిపేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. బుధవారం సెలవు కావడంతో జలపాతానికి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు జలపాతం వద్ద పర్యాటకుల సందడి కనిపించింది.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి | www.andhrajyothy.com

ఏజెన్సీ సమాచారం

'భూపతిపాలెం' నుంచి నీరు విడుదల



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

రంపచోడవరం, జూలై 17: భూపతిపాలెం జలాశయం నుంచి ఎమ్మెల్యే ఎం.శిరీషాదేవి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు విజయభాస్కర్ బుధవారం నీటిని విడుదల చేశారు. జలాశయం ద్వారా ఖరీఫ్ సీజన్‌లో రంపచోడవరం, గంగవరం మండలాల్లో సుమారు 11,526 ఎకరాలకు సాగు నీరు సరఫరా అవుతుందన్నారు. కార్యక్రమంలో ఈఈ ఎస్.వి.నాగేశ్వరరావు, డీఈలు పి.శ్రీనివాసరావు, రాజకుమారి, టీడీపీ మండలాధ్యక్షుడు కారం సురేష్‌బాబు, మాజీ అధ్యక్షుడు అడబాల బాపిరాజు, మాజీ సర్పంచ్ వై.నిరంజనీదేవి, చవలం బాపిరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

రంపచోడవరం, జూలై 17: పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే ఎం.శిరీషాదేవి అన్నారు. బుధవారం స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల (బాలికలు)ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. నీటి సమస్య, కోతుల బెడద ఎక్కువగా ఉందని విద్యార్థినులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కళాశాలలో సమస్యలుంటే తమకు లేదా అధికారులకు లిఖిత పూర్వకంగా తెలపాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసూన, డిప్యూటీ వార్డెన్ పద్మావతి, పాఠశాల ప్రిన్సిపాల్ పి.వై.భాగ్యలక్ష్మి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ఎం.విజయభాస్కర్, సలాది బాపిరాజు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో పూజలు

రంపచోడవరం, జూలై 17: మండలంలోని ఐ.పోలవరం గోవిందగిరిపై వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దివ్యక్షేత్రంలో ఆషాఢమాస శుద్ధ ఏకాదశి(తొలి ఏకాదశి) సందర్భంగా బుధవారం ఆలయ అధికారి నారాయణ రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పండితులు సాయిరామశర్మ ఘనాపాఠి, అర్చకులు దీవి పార్థ వెంకటరామ శ్రీనివాస్, గోవర్ధనం శ్రీమణికంఠాచార్యులు పూజలు జరిపించారు. స్థానిక కోదండ రామాలయంలో ఆలయ అర్చకులు యజ్ఞసూర్యసాయి కిరణ్ తులసి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నారాయణగిరి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు అద్దంకి వెంకటేశ్వరరావు విశేష పూజలు జరిపించినట్లు ధర్మ ప్రచార భక్త మండలి సమన్వయకర్త నల్లిమిల్లి వెంకటరామారెడ్డి తెలిపారు.

ఎమ్మెల్యే శిరీషాదేవి ఆర్థిక సాయం

రాజవొమ్మంగి జూలై 17: రాజవొమ్మంగి మండలంలోని లబ్బర్తి గ్రామనికి చెందిన కె.జె నతనియల్ కుటుంబానికి ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆర్థిక సాయం అందించి కష్ట సమయంలో తోడుగా నిలిచారు. నతనియల్ పాస్టర్ గా ఉంటూ జీవనం సాగించేవాడు. గత కొంత కాలంగా నతనియల్ అనారోగ్యానికి గురై విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారనే విషయం తెలుసుకున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి,ఆమె భర్త తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ గత వారం నతనియల్ కుటుంబానికి 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. అయితే నతనియల్ బుధవారం ఉదయం మృతిచెందగా విశాఖపట్నం ఆసుపత్రి నుంచి లబ్బర్తి గ్రామానికి వచ్చేందుకు సుమారు 10 వేల రూపాయలతో ఎమ్మెల్యే దంపతులు ప్రైవేట్ అంబులెన్స్ ఏర్పాటు చేశారు.

న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి



దేవీపట్నంలో మాట్లాడుతున్న నాయకులు

దేవీపట్నం, జూలై 17: రంపచోడవరం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో రాజవొమ్మంగి, వై.రామవరం, అడ్డతీగల, గంగవరం, దేవీపట్నం, మారేడుమిల్లి, చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక, రంపచోడవరం కలిపి మొత్తం 11 మండలాల పరిధిలో విద్యార్థులకు న్యాయ కళాశాల లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లి అభ్యసిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్నదొర, కొండదొరల సంఘం జిల్లా నాయకులు యాలగాడ నాగేశ్వరరావు, కొండరెడ్ల సంఘం నాయకులు పల్లాల లింగారెడ్డి, పల్లాల చిన్నారెడ్డి, శారపు శ్రీనుబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి మీడియా పాత్ర కీలకం

● అనపర్తి ప్రెస్‌క్లబ్ కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జూలై 17: ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేస్తూ మీడియా పోషించేపాత్ర కీలకమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అనపర్తిలోని పంచాయతీ రామాలయ ప్రాంగణంలో అనపర్తి నియో జకవర్గ ప్రెస్‌క్లబ్ (ఏపీయుడబ్ల్యుజె) అనుబంధ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

విజయసాయిరెడ్డి రాజ్యసభ సభ్యత్వం రద్దు చేయాలి



అనపర్తిలో ఏపీయుడబ్ల్యుజే ఆధ్వర్యంలో జరిగిన నిరసన ర్యాలీలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి: మీడియా ప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి రాజ్యసభ సభ్యత్వం రద్దు చేయాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మీడియా ప్రతినిధులపై ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం అనపర్తి నియోజకవర్గ ప్రెస్‌క్లబ్ (ఏపియుడబ్ల్యుజె) ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ప్రెస్‌క్లబ్ నియోజకవర్గ అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరెడ్డి (బుజ్జి), ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు సత్తి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధులు ఎమ్మెల్యే నల్లమిల్లి, ఎన్డీయే నాయకులు ప్రెస్‌క్లబ్ నుంచి దేవీచౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి విజయసాయికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మీడియా ప్రతినిధులు వియసాయిపై చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీజేపీ నాయకుడు శివరామకృష్ణంరాజు, టీడీపీ నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, కొవ్వూరి వెంకటరామారెడ్డి, కర్రి వెంకట రామారెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, జనసేన నాయ కుడు రావాడ నాగు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిదులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

గోకవరం: జర్నలిస్టులను దుర్భాషలాడిన వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక విలేఖరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేసే జర్నలిస్టులపై ఎంపీ విజయసాయిరెడ్డి నోరుపారేసుకోవడం ఎంత వరకు న్యాయమంటూ విలేఖరులు ప్రశ్నించారు. విజయసాయిరెడ్డి జర్నలి స్టు సంఘాలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని విలేఖరులు పోలీసులకు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

కోరుకొండ, జూలై 17: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలోని ప్రముఖ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వ్యవసాయ గ్రామా ల్లో రైతులంతా తొలి ఏకాదశి పండుగను జరుపుకుని ఆయా గ్రామదేవతలకు నైవేద్యాలు పెట్టుకున్నారు. ఖరీఫ్ వ్యవసాయానికి ముందుగా నారుమడి వేసే సందర్భంలో రైతులు కొంత ధాన్యాన్ని ఆ ఇంట ఆడపడుచులకు పేరంటంగా పెడతారు. ఈ ధాన్యాన్ని దంచి బియ్యంగా తయారు చేసి ఈ రోజు ఆ బియ్యంతో ప్రత్యేక పిండివంటలు, హారది, కుడుములు చేసి గ్రామదేవతలకు నైవేద్యంగా పెట్టడం ఇక్కడ సాంప్రదాయం. చారిత్రాత్మక కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. కొండపైన, స్వామివారి స్వయంభు కొండపైకి పెద్దఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

రాజమహేంద్రవరంకల్చరల్: బుధవారం తొలి ఏకాదశి పర్వదినం కావడంతో దేవాలయాలు భక్తజన సందోహంతో కిటకిటలాడాయి. దైవ దర్శ నంకోసం భక్తులు కుటుంబ సమేతంగా బారులు తీరారు. ఆనాల వెంకటప్పారావురోడ్డు, తిలక్‌రోడ్డు, దేవీచౌక్‌లోని పూరీజగన్నాథస్వామి అల యంలో భక్తులు పోటెత్తారు. కార్యక్రమంలో ఆదిత్య కాలేజీ డైరెక్టర్ గంగి రెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ ఫణికుమార్, కృష్ణారావు, రమాదేవి, సిబ్బం పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: దివాన్‌చెరువులోని ఆగమాశ్రమం ప్రాంగణంలో గల శ్రీ వేంకటేశ్వరస్వామి, రాయుడుపాకల వేంకటేశ్వరస్వామి ఆలయాలను తులసి మాలతో అందంగా అలంకరించారు. అలాగే తులసిదళాలతోనూ, వివిధ రకాల పుష్పాలతో స్వామి అమ్మవార్లకు విశేష అర్చనలను ఆలయ అర్చకులు నిర్వహించారు.

కన్నుల పండువగా శ్రీనివాసుని కల్యాణం

బిక్కవోలు: బలభద్రపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరుని ఆలయంలో తొలి ఏకాదశిని పురస్కరించుకుని స్వామి అమ్మవార్ల కళ్యాణం బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కొవ్వూరి రమాకాంతరెడ్డి, మంగ దంపతులు కళ్యాణ కర్తలుగా వ్యవహరించగా అర్చకులు రామకృష్ణాచార్యులు కళ్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కళ్యాణం తిలకించారు. భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ మల్లిడి గంగారెడ్డి ప్రసాద వితరణ చేశారు.



ధవళేశ్వరంలో అలంకరణలో దర్శనమిస్తున్న వెంకటేశ్వరస్వామి వారు

శాకాంబరి దేవిగా ఓనువులమ్మ తల్లి

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు గ్రామంలో ఉన్న ఓనువులమ్మ తల్లి శాకాంబరీ దేవిగా దర్శనమిచ్చారు. తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని పలు రకాల కూరగాయలు, పండ్లు, ఆకు కూరలతో సర్వాగ సుందరంగా దేవిని అలంకరించారు. ఉదయం నుండే భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన, విశేషపూజలు నిర్వహించారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ధవళేశ్వరం: తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా దేవదాయ శాఖ పరిధిలోని శ్రీదేవిభూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లక ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనానికి ఉదయం నుంచే భక్తులు క్యూకట్టారు. దర్శనం అనంతరం పలు రకా ల ప్రసాదాలు వితరణ చేశారు. దేవదాయశాఖకు చెందిన లక్ష్మీజనార్ధన స్వామి ఆలయంలో తెల్లవారుజామున స్వామి అమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామి వారు ఉభయ దేవేరులతో కలిసి భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక గడియా స్థంబం వద్ద గల కోదండ రామాలయంలో స్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ రమా సమేత సత్యనారాయణ మూర్తికి విశేష పూజలు నిర్వహించగా భక్తులు దర్శించుకున్నారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మహిళా సమాజం ఆధ్వర్యంలో భగవద్గీతను పఠించారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

● ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరంరూరల్, జూలై 17: నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని ప్రతీ విద్యార్థి ఉత్తమ పౌరులుగా ఎదగాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు. షిర్డిసాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో జరిగిన స్టార్‌గ్రూప్ ఫార్మేషన్ ఆవిర్భావసభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడు తూ విద్యార్థి దశనుంచి నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడం ద్వారా సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుందని, తద్వారా ఉత్తమపౌరులుగా ఎదుగుతారన్నారు. ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, నగర కమీషనర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. ర్యాంకులే లక్ష్యంగా సాగుతున్న ప్రస్తుత విద్యాసంస్థల్లో ర్యాంకులతో పాటు ఇతర రంగాల్లో కూడా విద్యార్థులు పాల్గొనేలా శిక్షణ ఇస్తున్న షిర్డిసాయి విద్యాసంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో షిర్డిసాయి విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, డైరెక్టర్లు టి. శ్రీవిద్య, టి.శ్రీలేఖ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



షిర్డిసాయి విద్యాసంస్థలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసు, కమిషనర్ దినేష్‌కుమార్

వృద్ధులు, అనాధ పిల్లల పట్ల మానవత్వం ఉండాలి

●వృద్ధాశ్రమాన్ని సందర్శించిన కలెక్టర్ ప్రశాంతి



జామ మొక్కనాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 17 : నేటి ఆధునిక సమాజంలో వృద్ధాశ్రమాల అవసరం పెరుగుతోందని, ఈ నేపథ్యంలో వాటి నిర్వహణ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం నారాయణపురంలోని శ్రీ గౌతమీ జీవకారుణ్య వృద్ధుల ఆశ్రమాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమం ఆవరణలో కలెక్టర్ జామ మొక్కను నాటారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో ఆదరణ పొందుతున్న వృద్ధులు, చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి వారి బాగోగులు చూడాలని నిర్వాహకులకు సూచించారు. వృద్ధాశ్రమంలో 66 మంది వృద్ధులతోపాటు 22 మంది అనాథ పిల్లలకు ఆశ్రయం ఇస్తున్నట్టు ఈవో పల్లంరాజు తెలిపారు.

జి.జి.యు.ను సందర్శించిన ఐఆర్ఎస్ అధికారులు

రాజానగరం, జూలై 17 : గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జి.జి.యు)ను ముంబైలోని ఆదాయపన్నులశాఖ అడిషనల్ కమీషనర్ హర్షద్, కస్టమ్స్ జీఎస్టీ అదనపు కమీషనర్ అనుశ్రీ బుధవారం సందర్శించారు. తమ వ్యక్తిగత పనులపై జిల్లాకు వచ్చిన ఇద్దరు ఐ.ఆర్.ఎస్. అధికార్లు జి.జి.యు.ను సందర్శించి, జి.జి.యు.ఛాన్సలర్ కె.వి.వి.సత్యనారాయణరాజు (చైతన్యరాజు)తో సమావేశమై పలు విషయాలను చర్చించారు. విశ్వవిద్యాలయం ప్రాంగణం పచ్చని చెట్లుతో అహ్లాదకరంగా ఉందని యాజమాన్యాన్ని అభినందించారు. అలాగే వర్సిటీలోని మౌళికవసతులు పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఇద్దరు ఐ.ఆర్.ఎస్. అధికార్లను చైతన్యరాజు దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

ఏపీ పెన్షనర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

రాజమహేంద్రవరంకల్చరల్ జూలై 17: స్థానిక ప్రకాశంనగర్ ధర్మంచర హాలులో బుధవారం ఏపీ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ 49వ వార్షికోత్సవ సభ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెన్షనర్లు ఆర్థికంగా చాలా నష్టపోయారని, ఇప్పుడు కొత్తగా వచ్చిన ప్రభుత్వం, గతంలో పెన్షనర్లకు జరిగిన నష్టాన్ని అంచలంచెలుగా సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చారని, ఉద్యోగ సంఘ నాయకులతో చర్చలకు సంసిద్ధత వ్యక్తం చేసిందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాస్ మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో 3500 మంది పెన్షనర్లు ఉండటం చాలా ఆనందదాయకమన్నారు. నగర అధ్యక్షులుగా కె.కె.సంజీవరావు, సహాధ్యక్షులుగా కొండపల్లి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా జి.శేషగిరిరావు, అడ్డా వెంకటరాజు, కనకం చంద్రశేఖర్, మట్టపర్తి సత్యనారాయణ, కె.ఎస్.వి. ప్రసాద్, మొల్లేటి సత్యనారాయణ, కోశాధికారిగా ఎస్‌కెవీఎస్‌రాజు ఎన్నికయ్యారు.

నేడు ఎస్‌వీ రంగారావు సంస్మరణ సభ

రాజమహేంద్రవరం సిటీ, జూలై 17: తెలుగు చలన చిత్రసీమాలో విభిన్నమైన పాత్రలు పోషించి ప్రేక్షకలోకాన్ని మెప్పించిన మహానటుడు ఎస్‌వీ రంగారావు 50 వర్ధంతిని పురస్కరించుకుని రాజమహేంద్రవరం జిత్ మోహన్‌మిత్రా కళావేదికలో గురువారం సాయంత్రం సంస్మరణ సభ నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు, రాజకీయ విశ్లేషకుడు అడబాల మరిడయ్య తెలిపారు. ఈ సభకు ప్రముఖ గాయకుడు నటుడు జిత్ మోహన్ మిత్రా అధ్యక్షత వహిస్తారని, ముఖ్యఅతిథిగా చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, సాకినేని మల్లికార్జునరావు, ఎస్ గోవింద్ హాజరవుతారని తెలిపారు. కళాకారులు ,అభిమానులు ఈ సభకు హాజరుకావాలని సుక్కిరెడ్డి శ్రీనివాసరావు, అనిశెట్టి ఆనంద్, అడబాల మరిడయ్యలు విజ్ఞప్తి చేశారు.

వేమగిరితోట డ్రైనేజీ సమస్యకు ప్రత్యేక చర్యలు

కడియం, జూలై 17:కడియం మండలం వేమగిరితోటలో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి చొరవ తీసుకున్నారు. ఆయన సూచనల మేరకు మంగళవారం ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శ్రీనివాసరావు ఈ అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రస్తుతం వర్షాకాలంలో మురుగునీరు బయటకు వెళ్లే పరిస్థితి లేనందున ట్యాంకర్ల ద్వారా నీటిని తోడే ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో గ్రామ కార్యదర్శి రాజశేఖర్‌కు ఆదేశాలిచ్చారు. ఇందుకోసం అమలాపురం నుంచి ప్రత్యేక మిషన్ కలిగిన ట్యాంకర్‌ను బుధవారం తీసుకువచ్చారు. యుద్ధ ప్రాతిపదికన ఈ ట్యాంకర్ ద్వారా మురుగునీరుని, డ్రైనేజీల్లో ఉన్న పూడికను తోడి తరలించడం మొదలుపెట్టారు. ఈ అభివృద్ధి పనులను టీడీపీ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస్, వాసంశెట్టి నాగబాబు, అప్పారి అన్నవరం, గుత్తుల ముత్యం, యనమదల రాజు, వాశంశెట్టి బాలాజీలు పర్యవేక్షించారు.

బీసీలను పట్టించుకోని మాజీ మంత్రి, మాజీ ఎంపీ

● తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 17 : తెలుగుదేశం పాలనలోనే బీసీలకు స్వర్ణయుగం అని టీడీపీకి చెందిన పలువురు బీసీ నాయకులు అన్నారు.. గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ, మాజీ ఎంపీ భరత్‌రామ్ ఏనాడూ బీసీలను పట్టించుకోలేదని, సొంత లాభం చూసుకుంటూ బీసీల సంక్షేమాన్ని అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. బుధవారం రాజమహేంద్రవరం వై.జంక్షన్‌లోని బీసీ బాలుర వసతిగృహాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ సాధికారసమితి శెట్టి బలిజ విభాగం కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, రాజమండ్రి పార్లమెంట్ అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, టీడీపీ నగర కమిటీ ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధ మాట్లాడారు. సిటీ ఎమ్మెల్యేగా ఆదిరెడ్డి వాసు ఎన్నికైన నెలరోజులు కూడా తిరగకముందే బీసీ హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించారని హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వాసు చొరవతో కిమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో సుమారు రూ.13 లక్షలు వ్యయంతో 22 మరుగుదొడ్లు నిర్మించామన్నారు. గణేష్‌చౌక్‌లోని బీసీ బాలికల వసతిగృహంలో 18 నుంచి 20 బాత్రూమ్‌లను బాలికలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతున్నదని తెలిపారు. నగర కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి మరుకుర్తి రవియాదవ్, కార్యదర్శి కిలపర్తి శ్రీను, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి కృషిచేస్తా

● బీజేపీ రాజానగరం ఇన్‌చార్జి వీరన్నచౌదరి

కోరుకొండ, జూలై 17: చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం అభివృద్ధికి తన వంతుకృషి చేస్తానని తమ సమస్యలను దేవదాయధర్మాదయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళతానని బీజేపీ రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీరుకొండ వీరన్నచౌదరి పేర్కొన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ నుంచి దగ్గుపాటి పురందేశ్వరి అఖండమెజార్టీతోవిజయం సాధిస్తే కాలినడకన కోరుకొండ కొండపైకి వెళ్లి స్వామి వారిని దర్శించుకుంటానని ఎన్నికల ముందు ఆయన మొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్రీ లక్ష్మీనరసింహస్వామి కొండపైకివెళ్లి స్వయంభుగా వెలిసిన స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ కేంద్రకమిటీ సభ్యుడు మోది సత్తిబాబు, జిల్లా కార్యదర్శి చీర్ల దొరబాబు, తగరంపూడి గణపతి, టీడీపీ నాయకులు కామిశెట్టి దొరబాబు,మాతాప్రభు, కట్టా సత్తిబాబు,బీజేపీ మహిళా మోర్చానాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్యుని జయంతి

బిక్కవోలు, జూలై 17: బలభద్రపురంలో యువ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్యుని జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కూటమి నేత నల్లమిల్లి సుబ్బారెడ్డి, జిల్లాఎరుకల సంఘ అధ్యక్షుడు రామకృష్ణ ఏకలవ్యుని చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రాగానే పది మంది ఎరుకలకు రూ. 5లక్షలు రుణం మంజూరయ్యిందని, దానిని బలభద్రపురంలోని ఎరుకలకే అందించేందుకు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సుముఖత వ్యక్తం చేశారన్నారు. అలాగే స్థలం చూపితే ఎరుకులకు కమ్యూనిటీ హాలు నిర్మించేందుకు ఎమ్మెల్యే సానుకూలంగా ఉన్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఎరుకల సంఘ అధ్యక్షుడు గిలక మాచర్రావు, ఎంపీటీసీ సభ్యులు చిన్నం వీర్రాఘవరెడ్డి, మల్లిడి కనక ప్రసాద్‌రెడ్డి, అధిక సంఖ్యలో ఎరుకల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడి సోదరి మృతికి ఎమ్మెల్యే నివాళి

బిక్కవోలు, జూలై 17: బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పవన్‌కుమార్‌రెడ్డి సోదరి ప్రియాంక ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందడంతో బుధవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆకుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈయన వెంట కూటమి నేతలు గొర్రెల త్రిమూర్తులు, పవన్‌కుమార్‌రెడ్డి, సింగారపు రామారావు, చాగంటి సాయిబాబారెడ్డి, గుణ్ణం రమేష్, చిటికిన సుబ్రహ్మణ్యం, సిద్ధు, లోవరాజు పాల్గొన్నారు.

ఫొటో గ్రాఫర్స్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

రాజానగరం, జూలై17 : రాజానగరం మండల ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గప్రమాణస్వీకారం బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా మరిడి మురళీ, ఉపాధ్యక్షులుగా దారాశివ, కార్యదర్శిగా నల్లమిల్లి మోహన్, సంయుక్త కార్యదర్శిగా కె.సుందర్‌విజయ్‌కుమార్‌తోబాటు అసోసియేషన్ బాధ్యులు, కార్యవర్గసభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పోసిన వీరేంద్రకుమార్, జిల్లా అధ్యక్షుడు కోనే శ్రీను, జిల్లా గేరవాధ్యక్షుడు దొండపాటి లాజరు పాల్గొన్నారు.

జూనియర్ విద్యార్థులకు స్వాగత వేడుక

రాజానగరం, జూలై 17 : కానవరంలోని గాయత్రీవిద్యాసంస్థల ప్రాంగణంలో జూనియర్ ఇంటర్ విద్యార్థులకు బుధవారం ఘనంగా స్వాగత వేడుకలు నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ ఇంటర్ విద్యార్థులు ప్రసంగించారు. గత ఏడాది ఇంటర్ ఫలితాలలో ప్రతిభ చూపిన విద్యార్థులు పి.నర్మద, పడాల వేద హర్ష, శివకావ్యయశస్వీలకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ విద్యాసంవత్సరంలో ఉచిత విద్యను అందిస్తామని ప్రిన్సిపాల్ దేవీ బంగారం తెలిపారు

ప్రజా సమస్యలు పరిష్కరించిన ఎమ్మెల్యే

కోరుకొండ, జూలై 17: రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ బుధవారం కోరుకొండ జనసేన పార్టీకార్యాలయంలో నియోజకవర్గం నుంచి తరలివచ్చిన ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాలకు చెందిన పలు గ్రామాల నుంచి వందలసంఖ్యలో ప్రజలు తరలివచ్చి ఎమ్మెల్యేకు తమ సమస్యల అర్జీలను అందజేశారు. కార్యక్రమంలోజనసేన నాయకులు డాక్టర్ అడపా శ్రీనివాస్, మేడిశెట్టి శివరాం, దేవన దుర్గాప్రసాద్,యర్రంశెట్టిపోలారావు, నాతిపాము దొరబాబు, బత్తులగోపాలకృష్ణ, బదిరెడ్డి దొర తదితరులు పాల్గొన్నారు.

చల్లా ప్యానల్‌తోనే ఆర్యాపురం బ్యాంక్ అభివృద్ధి

● ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 17 : గత ఐదేళ్లుగా రాష్ట్రాన్ని నాశనం చేయడంతో పాటు కోఆపరేటివ్ వ్యవస్థను వైసీపీవారు నాశనం చేశారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం ఏపీ పేపరుమిల్లు మెయిన్ గేట్ వద్ద బుధవారం సాయంత్రం బ్యాంక్ ఎన్నికల్లో కూటమి పక్షాన పోటీ చేస్తున్న చల్లా శంకర్రావు ప్యానల్‌కు మద్దతుగా ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంక్‌కు ఒక చరిత్ర ఉందన్నారు. వైసీపీ వాళ్ళు దానికి ఎన్నికలు నిర్వహించడకుండా బ్యాంక్‌కు రాబడిలేకుండా బ్యాంక్‌ను దిగజార్చాలని అన్నారు. అనంతరం చైర్మన్ అభ్యర్థి చల్లా శంకర్రావు మాట్లాడుతూ 2014లో ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్‌గా రాష్ట్రంలోనే బ్యాంక్‌ను నెంబరు వన్‌గా తీర్చిదిద్దానన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక బ్యాంక్‌ను దారుణస్థితికి తీసుకువెళ్లారన్నారు. బ్యాంక్ వృద్ధి సాధించాలంటే తమ ప్యానల్‌లో ఉన్న వారందరినీ గెలిపించాలని కోరుతున్నామన్నారు. పేపరుమిల్లు కార్మికుల్లో అధికశాతం తమ బ్యాంక్ ఖాతాదారులు ఉన్నారని వారు తమ ప్యానల్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం విధులు ముగించుకుని బయటకు వస్తున్న కార్మికులను ఎమ్మెల్యేను కలిసి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్యానల్‌లో పోటీలో ఉన్న యెనుముల రంగబాబు, పడాల శ్రీనివాస్, పెదకాపు, బుడ్డిగ రవి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, ఆర్గనైజింగ్ సెక్రటరీ మరుకుర్తి రవియాదవ్, మాజీ కార్పొరేటర్ మొకమాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీలకు ప్రాధాన్యం ఇవ్వలేదనేది అవాస్తం'

అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో చల్లా శంకర్రావు ప్యానల్‌లో ఎస్సీలకు ప్రాధాన్యం ఇవ్వలేదని వైసీపీ చేస్తున్న ఆరోపణలు సత్యదూరమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ అన్నారు. దళితులకు రాజకీయ అవకాశాలు కల్పించిన పార్టీ టీడీపీ అని దానిని ఎవరైనా ఒప్పుకుని తీరాల్సిందేనన్నారు. ఎస్సీలంతా చల్లా ప్యానల్‌ను గెలిపించబోతున్నారని చెప్పారు.

ఎన్డీఏ కూటమి బలపరిచిన మా ప్యానెల్‌ని గెలిపించండి

రాజమహేంద్రవరం కల్చరల్: ఎన్డీఏ కూటమి బలపరిచిన మా ప్యానెల్‌కు ఓటువేసి గెలిపించండి అని ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ అభ్యర్థి చల్లా శంకరరావు కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నా హయాంలో బ్యాంకు అభివృద్ధిబాటలో నడిచిందన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి: ఎమ్మెల్యే బత్తుల

దివాన్‌చెరువు, జూలై 17: ది ఆర్యాపురం కోఆపరేటివ్ పాలకవర్గంకు ఈ నెల 20న జరబోయే ఎన్నికలలో పోటీచేస్తున్న టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి అభ్యర్థులను బలపరచి గెలిపించాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కోరారు. దివాన్‌చెరువులో బుధవారం జరిగిన సమావేశంలో నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దివాన్‌చెరువు బ్రాంచి డైరెక్టరుగా పోటీచేస్తున్న కూటమి అభ్యర్థి నీలపాల సూర్యసత్యనారాయణను, చైర్మన్ అభ్యర్థి చల్లా శంకర్రావును గెలిపించాలని ఎమ్మెల్యే బత్తుల, టీడీపీ రాజానగరం నియోజకవర్గం ఇన్‌చార్జి, బొడ్డు వెంకటరమణచౌదరి కోరారు. సమావేశంలో జనసేన నాయకులు వై.శ్రీను, దేశాలశ్రీను, టీడీపీ నాయకులు గంగిశెట్టిచంటిబాబు, వంక మల్లిబాబు, గంగిబ్రహ్మాజు, కొణతం నరసింహారావు, బాంకు ఎన్నికలలో డైరెక్టరు పదవికి పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి నీలపాల సూర్యసత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జేవీకే ఆసుపత్రి ప్రారంభం



జేవీకే ఆసుపత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ జాన్ వెస్లీ తల్లిదండ్రులు జోసఫ్ విజయకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 17: రాజమహేంద్రవరం క్వారీ మార్కెట్ - లాలాచెరువు రోడ్డులోని క్రైస్ట్ వర్షిప్ సెంటర్‌లో జాన్‌వెస్లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జేవీకే హాస్పటల్‌ను బుధవారం ఘనంగా ప్రారంభించారు. జాన్‌వెస్లీ ఫౌండేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ, వారి తల్లిదండ్రులు జోసఫ్‌విజయకుమార్, సత్యవిజయకుమార్‌లు ప్రార్ధన చేసి ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, షకీనాగ్లోరి కుటుంబం, పాల్ ఇమ్మానుయేలు కుటుంబం, అనేక మంది దైవజనులు హాజరయ్యారు. జాన్ వెస్లీ, బ్లెస్సీ వెస్లీలు మాట్లాడుతూ అనుభవజ్ఞులైన డాక్టర్లచే అత్యాధునిక పరికరాలతో నాణ్యమైన వైద్యం అందించడానికి మేము కృషిచేస్తామన్నారు.

పౌల్ట్రీ రైతుల సమస్యలు పరిష్కరించాలని మంత్రి లోకేశ్‌కు వినతి



విజయవాడలో మంత్రి లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఏపీ పౌల్ట్రీ ప్రతినిధులు

అనపర్తి, జూలై 17: ఏపిలో పౌల్ట్రీ పరిశ్రమ సంక్షోభంలో ఉందని కోళ్ళ రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం విజయవాడలో మంత్రి నారాలోకేశ్‌ను ఏపీ పౌల్ట్రీ ఫెడ రేషన్ ప్రతినిధులు కలిసి వితనిపత్రం అందజేశారు. ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ పడాల సుబ్బారెడ్డి పౌల్ట్రీ రైతులు ఎదుర్కొం టున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి లో కేశ్ సానుకూలంగా స్పందించారని త్వరలోనే సమస్యల పరి ష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని సుబ్బారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు కాల్దారి సుబ్బారావు, ఉభయగోదావరి, కృష్ణా, జిల్లాల రైతులు పాల్గొన్నారు.



పారదర్శకంగా విధులు

- చట్టాన్ని ఉల్లంఘిస్తే ఉపేక్షించం
- నూతన జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ వెల్లడి



కలెక్టర్‌ను కలిసిన కొత్త ఎస్పీ.. బాధ్యతలు స్వీకరిస్తున్న నరసింహ కిషోర్



రాజమహేంద్రవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పారదర్శక విధి నిర్వహణతో ప్రజా సమస్యలకు తొలి ప్రాధాన్యం ఇస్తామని నూతన ఎస్పీ డి.నరసింహకిషోర్ వెల్లడించారు. బుధవారం అర్చకుని వేద మంత్రోచ్చారణ నడుమ కార్యాలయంలోకి ప్రవేశించి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సహకారంతో జిల్లాలోని పోలీసు శాఖ ప్రతిష్టను మరింత పెంపొందించే విధంగా విధులు నిర్వర్తిస్తామన్నారు. జిల్లాలో అశాంతికి తావులేకుండా నేరాల అదుపునకు కృషి చేస్తామని, అలాగే గంజాయి, మాదకద్రవ్యాలు, నాటుసారా, మహిళలపై వేధింపులు వంటి సమస్యలపై ఉక్కుపాదం తప్పదన్నారు. అసాంఘిక వ్యక్తులు, పాత నేరస్తులు, రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. సాధారణ జనజీవనానికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కటకటాలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ.. బాధితులకు త్వరితగతిన సాంత్వన చేకూర్చే విధంగా పనిచేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తామని స్పష్టంచేశారు. తొలుతగా గౌరవ వందనాన్ని స్వీకరించారు. అడిషనల్ ఎస్పీ(పరిపాలన) రాజశేఖర్‌రాజు, ఎస్‌బీ డీఎస్పీ ప్రభాకర్, వివిధ జోన్ల డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.రఘురాం, ఉపాధ్యక్షుడు జె.సాయిమహేశ్ తదితరులు ఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ పి.ప్రశాంతిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఆయనకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. జిల్లాలోని శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్, ఎస్పీ చర్చించారు.

నీలగిరి కలెక్టరుగా తెలుగమ్మాయి

తాళ్లపూడి, జూలై17: తమిళనాడులోని నీలగిరి (ఊటీ) జిల్లా కలెక్టరుగా తెలుగమ్మాయి బాధ్యతలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామానికి చెందిన తన్నీరు సాయి, ఝాన్సీరాణి దంపతుల కుమార్తె తన్నీరు లక్ష్మీభవ్య నీలగిరి జిల్లా కలెక్టరుగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. లక్ష్మీ భవ్య రాజమండ్రి ట్రిప్స్ ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో చదివారు. భీమవరం విష్ణు కాలేజీలో ఇంజనీరింగ్‌చేసి 2015లో 88వ ర్యాంకుతో ఐఏఎస్‌కు ఎంపికై వెస్ట్‌బెంగాల్‌లో సబ్‌కలెక్టరుగా జాయిన్ అయ్యారు. తర్వాత తమిళనాడు రాష్ట్రంలో ఈరోడ్, తిరుపూర్, కరూర్ మూడు జిల్లాలకు జాయింట్ కమిషనర్‌గా పనిచేసి ఇప్పుడు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆమె భర్త సుంకర రాజ్‌గోపాల్ కూడా తమిళనాడులోని ఈరోడ్ జిల్లా కలెక్టరుగా పనిచేస్తున్నారు. తమ గ్రామానికి చెందిన యువతి నీలగిరి జిల్లా కలెక్టరుగా బాధ్యతలు చేపట్టడం పట్ల అన్నదేవరపేట టీడీపీ యువగళం సభ్యులు కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, తొండెపు భరత్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

పిచ్చి బ్రాండ్లు.. నష్టమెంత?

- జగన్ మద్యం.. వందల పుస్తెలు మింగేసింది
- సర్వేలో వెలుగు చూస్తున్న భయంకర నిజాలు
- జే బ్రాండ్లతో కుటుంబాలు చిన్నాభిన్నం
- కిడ్నీ ఖతం.. గుండె గతితప్పి.. నాడీ వ్యవస్థ నిర్వీర్యమై..
- ఏళ్ల తరబడి అలవాటు ఉన్నా.. గత ఐదేళ్లలో బలి



జగన్ పిచ్చి బ్రాండ్లు వందలాది మంది ప్రాణాలను హరించేశాయనే నిజం ఇప్పుడు ప్రకంపనలు రేపుతోంది. తన పుస్తెలను నకిలీ, నాసిరకం మద్యమే మింగేసిందని బాధిత మహిళలు ఆనాడు ఎంత రోదించినా పట్టించుకునే పాలకులు లేకపోయారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో నాసిరకం మందు కాటుకు కుటుంబాలు చిన్నాభిన్నం కావడం నిజమేననే విషయం ఇప్పుడు బయటపడుతోంది. చాలా ఏళ్ల నుంచీ మద్యం అలవాటు ఉన్నా గత ఐదేళ్లు నెట్టుకురాలేక జే బ్రాండ్ల గరళానికి బలైపోయిన వాళ్ల సంఖ్య జిల్లాలో వందల్లో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. వైసీపీ హయాంలో విషాన్ని మద్యం రూపంలో అధికారికంగా అమ్మేశారనేది ప్రధాన ఆరోపణ. ఏపీలో మద్యం అంటేనే ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవాళ్లు భయపడిపోయేవాళ్లు. కిడ్నీలు పాడై, గుండె గతితప్పి, నాడీ వ్యవస్థ నిర్వీర్యమై, ఉదర సంబంధిత వ్యాధులు ఎక్కువై మంచాన పట్టిన వారు ఎందరో ఉన్నారు. ఇప్పుడు ఇవన్నీ వెలుగు చూస్తున్నాయి. జిల్లాలో ఇంకా కొనసాగుతున్న ఓ సర్వే జగన్ చేసిన పాపానికి ఎప్పటికీ ప్రాయశ్చిత్తం లేదనే వాస్తవాన్ని మౌనంగా వెల్లడిస్తోంది. ఇంటి యజమానులు జగన్ పిచ్చి బ్రాండ్లకు బలైపోగా, జీవచ్ఛవాల్లా బతుకులీడుస్తున్న కుటుంబాలు లెక్కకు మించి ఉన్నాయని తేలుతోంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కడియం మండలం బుర్రిలంకకు చెందిన ఒక వ్యక్తికి చీప్ లిక్కర్ అలవాటు ఉంది. ఎప్పటినుంచో మద్యం అలవాటు ఉన్నా జే బ్రాండ్ల మద్యం వల్ల ఆకలి ఉండేది కాదు. దీంతో రెండు నెలల పాటు మద్యమే ఆహారమైంది. తర్వాత నెమ్మదిగా నీరసపడగా వైద్యుడు కిడ్నీ పరీక్ష చేయించారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని తేలింది. ఈలోపు శరీరంపై చర్మం మాత్రమే మిగిలింది. కల్తీ మద్యానికి చివరికి బలైపోయాడు.

రాజమహేంద్రవరానికి చెందిన ఒక వ్యక్తి బంధువుది కోనసీమ జిల్లా. చాలా ఆరోగ్యంగా ఉండేవాడు. అతడికీ ఎప్పటి నుంచో మద్యం అలవాటు ఉంది. కానీ జగన్ మద్యం వచ్చిన తర్వాత లివర్ పాడైపోయింది. మనిషి జీవచ్ఛవంగా మారిపోయాడు. దీంతో హైదరాబాద్ తీసుకెళ్తే రూ.40 లక్షలు ఖర్చవుతుందని.. బతుకుతాడని నమ్మకం లేదని వైద్యులు చెప్పారు. దీంతో అతడిని వెనక్కి తీసుకొచ్చేశారు. నాలుగు రోజుల తర్వాత ఈ నాసిరకం మద్యానికి ప్రాణాలు కోల్పోయాడు.

- జగన్ హయాంలో మద్యానికి, విషానికి పెద్దగా తేడా ఉండేది కాదనే ఆరోపణలు వినవస్తుండేవి. కొన్ని బ్రాండ్లను కొందరు చెన్నైలోని ఓ ప్రధాన ల్యాబ్‌లో పరీక్షలు చేయిస్తే ఏపీలో విక్రయించే మద్యంలో విషపదార్థాలు ఉన్నాయని బయటపడింది. కానీ ఆనాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. మద్యం తయారీ ఫ్యాక్టరీ (డిస్టిలరీ)లను వైసీపీ నాయకులు చెరబట్టి నాసిరకం మద్యం తయారు చేసేవాళ్లు. నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా 'గాలి'కి వదిలేశారు. ప్రాణాంతకమైన మిథనాల్ వంటి రసాయనాలు, స్పిరిట్ వంటివి ఎక్కువగా కలపడం వంటివి చేసేవాళ్లని ఆరోపణలు ఉన్నాయి. దీంతో మద్యం అలవాటు ఉన్నవాళ్లు రకరకాల రుగ్మతల బారినపడడం జరిగేది. పూటకో బ్రాండుతో మద్యంబాబుల ప్రాణాలతో చెలగాటం ఆడేవాళ్లు. ఒకరోజు కనిపించిన బ్రాండు మరుసటి రోజున కనిపించేది కాదు. దీనిలోనూ చాలా మతలబు ఉండేది. ఈరోజు తయారుచేసిన బ్రాండు అమ్మకాలకోసం నిన్న తయారు చేసిన బ్రాండును ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టేసేవారు. బార్‌కి వెళ్లి కొనాలంటే రూ.70-90 అదనంగా వదిలించుకోవాలి. అప్పటికే జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మద్యం ధరలను విపరీతంగా పెంచేసింది. దీంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో దొరికే మద్యాన్నే గొంతులో పోసుకోక తప్పేది కాదు. అది వేగంగా ఆరోగ్యాన్ని హరించేసేది. ఇదంతా అధికారులకు తెలిసినా దారుణం వెనుక వైసీపీ నాయకులు ఉండడంతో ఏమీ చేయలేక చేష్టలుడిగి విధులు నిర్వర్తించక తప్పేది కాదు. దీంతో ఇటు చీప్ లిక్కర్, అటు నాటుసారా తాగి పేదలు ఎక్కువగా ప్రాణాలు విడిచేవారు.



ఎంతమంది బలైపోయారు?

జగన్ పిచ్చి బ్రాండ్లకు ఎంతమంది బలైపోయారనే విషయాన్ని నిగ్గుతేల్చడానికి ఓ ప్రక్రియ మొదలైంది. ఆనాటి ప్రభుత్వ మద్యం తాగి చనిపోవడం వల్ల రోడ్డున పడిన వాళ్లను ఎంతోకొంత ఆదుకుందామనే ఉద్దేశంతో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి చొరవతో వైద్యారోగ్యశాఖ వద్ద వివరాలను కోరగా ఫలితం లేకపోయింది. దీంతో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), పేదల నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో సర్వే చేయించారు. లోతైన విశ్లేషణ, నిర్ధారణ కోసం ఇంకా సర్వే కొనసాగుతోంది. మద్యం అలవాటు ఎప్పటి నుంచి ఉంది? చనిపోయే సమయానికి ఆయనకు ఎలాంటి వ్యాధులు ఉన్నాయి? అనే ప్రశ్నలు వేస్తున్నారు. 2019 నుంచి 2024 వరకూ వితంతువులు అయిన వారి ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించే ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో 64,795 మంది వితంతు పింఛనుదారులు ఉన్నారు. వారిలో ఇప్పటివరకూ సుమారు 7వేల మంది తమ భర్తలు మద్యం అలవాటు వల్ల 2019-2024 మధ్య చనిపోయారని చెప్పారు. వీళ్లలో జగన్ కల్తీ మద్యానికి బలైపోయిన వారు చాలామంది ఉంటారని తెలుస్తోంది. వాస్తవిక సమాచారం కోసం మరింత లోతైన పరిశీలన జరుగుతోంది. ఇప్పటివరకు అందిన గణాంకాల్లో రాజమహేంద్రవరం అర్బన్ మొదటి స్థానంలో ఉండగా, గోకవరం రెండో స్థానంలో ఉంది. సర్వే పూర్తయిన తర్వాత వైద్యులతో నిర్ధారణ, క్రోడీకరణ తర్వాత ఓ అంచనాకు రానున్నారు.

అప్పట్లో బెల్టులు వందల్లో..

మద్యం ఆదాయంపై నెట్టుకొచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వం టార్గెట్లు పెట్టి మరీ ఎక్సైజ్ శాఖను ఒత్తిడి చేసేది. తద్వారా జనాలతో పూటుగా తాగించేది. తూర్పుగోదావరి జిల్లాలోని 19 మండలాల్లో 158 మద్యం దుకాణాలు చాలవన్నట్టుగా వాక్‌ఇన్ స్టోర్స్‌ని మొదలు పెట్టింది. వీటికి వందల్లో బెల్టుషాపులు జతకలిశాయి. వీటిని వైసీపీ నాయకులు, లేదా వారి అండతో వేరొకరు నడిపేవాళ్లు. 2014-2019 మధ్య మందు కావాలంటే ప్రభుత్వం లైసెన్సు ఇచ్చిన షాపునకు వెళ్లి కొనుక్కోవాల్సిందే. కానీ 2019లో జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత గడప గడపకూ కల్తీ మందు అందాలన్నదే లక్ష్యంగా నిబంధనలనకు నీళ్లొదిలేసింది. సారా ఏరులై పారినా వదిలేసింది. వైసీపీ హయాంలో సారా విక్రయాలు కూడా విపరీతంగా పెరిగాయి. చాలాచోట్ల సారా దుకాణాలు బెల్టుషాపులుగా రూపాంతరం చెందాయి. పైగా అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కూడా మద్యం లభ్యమయ్యేది. గత ఏడాది ఓసారి కేవలం రెండు రోజుల్లో పోలీసులు గోదావరి లంకల్లో ఏకంగా 6 వేల లీటర్ల బెల్లపు ఊట స్వాధీనం చేసుకున్నారు. మరోచోట 4 వేల లీటర్ల సారాను ధ్వంసం చేశారు. అంత పెద్దఎత్తున తయారవుతున్న సారా ఊళ్లలోకి వచ్చి చేరేది. ఒకవైపు వైసీపీ ప్రభుత్వ నాణ్యత లేని మద్యం వల్ల ఆరోగ్యాలు నాశనమవుతుంటే సారా మరింత ఆజ్యం పోసేది. ఇవన్నీ కలిసి కుటుంబాలను రోడ్డున పడేసేవి.

మేం రెడీ!

- మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఎప్పుడు ప్రకటించినా ఓకే
- జిల్లాలో 285 ఆర్టీసీ బస్సులు
- ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక



రాజమహేంద్రవరంఅర్బన్, జూలై 17: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు ప్రకటించినా అమలుచేసేందుకు జిల్లా ఆర్టీసీ యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఆగస్టు నెలలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అమలుచేస్తామంటూ ఇప్పటికే రవాణాశాఖ మంత్రి సంకేతాలు పంపిన నేపథ్యంలో జిల్లా ఆర్టీసీ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈమేరకు ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిలా అశోక ఒక రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ రూట్‌మ్యాప్‌ను అమలుచేయనున్నారు. అయితే ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంతవరకూ తమకు గైడ్‌లైన్స్ రాలేదని షర్మిల అశోక స్పష్టంచేశారు. జిల్లాలో రాజమహేంద్రవరంతో పాటు గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోల్లో మొత్తం 285 వరకూ ఆర్టీసీ బస్సులున్నాయి. వీటిలో 206 సొంత బస్సులు కాగా, 79 అద్దె బస్సులు నడుపుతున్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు సర్వీసులకు సంబంధించి మొత్తం 129 ఆర్టీసీ బస్సుల్లో 126 సొంత బస్సులు, మూడు అద్దె బస్సులు ఉన్నాయి. సొంత బస్సులకు సంబంధించి పల్లెవెలుగు 126, అల్ట్రా పల్లె వెలుగు మూడు బస్సులు నడుపుతున్నారు. అద్దె బస్సులు 66 ఉంటే, 44 పల్లెవెలుగు సర్వీసులుగాను, 22 అల్ట్రా పల్లెవెలుగు సర్వీసులుగాను తిప్పుతున్నారు. అలాగే ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) ప్రతిరోజూ సుమారు 72 నుంచి 74 శాతం వరకూ ఉంటుంది. ఇందులోనూ సుమారుగా 50 శాతం మందికి పైగా మహిళలే ప్రయాణాలు చేస్తుంటారని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఆర్టీసీ సర్వీసులు నడపడం ద్వారా జిల్లా ఆర్టీసీకి రోజుకు రూ.36 లక్షల నుంచి రూ.38 లక్షల వరకూ ఆదాయం సమకూరుతోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి వస్తే ఈ ఆదాయంలో ఎంతమేర కోత పడుతుందనేదానిపై ఆర్టీసీ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే విధానపరమైన నిర్ణయం తర్వాతనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనున్నారు.

జిల్లా సరిహద్దులపై గందరగోళం

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం జిల్లాకే పరిమితమా లేక రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లి రావచ్చా అనేది చర్చనీయాంశంగా ఉంది. దీనిపై ప్రభుత్వం ఇంకా గైడ్‌లైన్స్ రూపొందించలేదు. అయితే చాలామంది మాత్రం జిల్లా పరిధిలోనే ఉచిత బస్సు సౌకర్యం అమలు చేస్తారనే ప్రచారం సాగుతోంది. దీంతో జిల్లా సరిహద్దులు ఏమిటనే దానిపై చర్చ సాగుతోంది. కొత్తగా ఏర్పడిన తూర్పుగోదావరి జిల్లాకు ఇటు గండేపల్లి, అనపర్తి, గోకవరం, సూరంపాలెం, అటు నల్లజర్ల, పెరవలి సరిహద్దులుగా ఉన్నాయి. దీంతో ఈ సరిహద్దుల వరకే ఉచిత ప్రయాణం అనుమతిస్తారా లేక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోనూ ఉచిత ప్రయాణం ఉంటుందా అనే మీమాంస కొనసాగుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరిలో కాకినాడ, తుని, అమలాపురం, రంపచోడవరం, మారేడుమిల్లి, చింతూరు, సీలేరు వరకూ పరిధి ఉంది. జిల్లాల విభజన తర్వాత జిల్లా పరిధిని కుదించారు. కాకినాడ, అమలాపురం కొత్త జిల్లాల్లోకి వెళ్లిపోయాయి. జిల్లాల విభజన తర్వాత పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న కొవ్వూరు, నిడదవోలు, తాళ్లపూడి గోపాలపురం, నల్లజర్ల వంటి మండలాలను కొత్తగా తూర్పుగోదావరిలో కలిపారు. ఈ పరిస్థితుల్లో ఆర్టీసీ ఉచిత ప్రయాణానికి సంబంధించి పాత జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుంటుందా లేక కొత్త జిల్లా ఒక యూనిట్‌గా ఉంటుందా? దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. కాగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదని ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేయడానికి తాము తగిన ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.



మున్సిపల్ సిబ్బందిని విచారిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, అధికారులు

దేవతా వృక్షం నరికివేతపై విచారణ

- పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్
- 'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందన
- నిర్లక్ష్యం వహించిన సిబ్బందిని సస్పెండ్ చేయాలని కమిషనర్‌కు ఆదేశం

కొవ్వూరు, జూలై 17: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో 120 సంవత్సరాల చరిత్ర కలిగిన దేవతా వృక్షాన్ని(రావిచెట్టును) నరికివేసిన సంఘటనలో బాధ్యులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'చెట్టంత కష్టం' వార్తకు మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి, కమిషనర్ కె.డానియేల్‌జోసఫ్‌లు సిబ్బందితో గోష్పాదక్షేత్రాన్ని సందర్శించారు. మున్సిపల్ సిబ్బంది, స్థానిక పురోహితులు, చెట్టు నరికిన కాంట్రాక్టర్‌ను విచారించారు. అయితే చెట్టును నరికివేయడంలో మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది, స్థానిక పురోహితులు తాము నరకమని చెప్పలేదంటే, తాము చెప్పలేదని ఒకరికి ఒకరు వాదులాడుకున్నారు. బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ కమిషనర్‌కు ఈ ఉదంతానికి సంబంధించి ఫొటోలను పంపినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ తన సెల్‌ఫోన్‌లో 150 వాట్సాప్ గ్రూపులు ఉన్నాయని, చూడలేదని బదులు ఇవ్వడంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. చైర్‌పర్సన్ రత్నకుమారి మాట్లాడుతూ గోష్పాదక్షేత్రంలో దేవతా వృక్షం కొమ్మ వర్షానికి విరిగి పడిందని, కొమ్మను తొలగిస్తున్నామని తమకు ఎటువంటి సమాచారం లేదన్నారు. అంతేగాకుండా చెట్టు మొదలు వరకు నరికివేశారని, దీనిపై ప్రశ్నిస్తే ఒకరిపై ఒకరు తప్పించుకునే ధోరణి ప్రదర్శిస్తున్నారన్నారు. గోష్పాదక్షేత్రంలో విధులు నిర్వహిస్తూ చెట్టు నరికివేస్తున్నా నిర్లక్ష్యం ప్రదర్శించిన సిబ్బందిని అవసరమైతే సస్పెండ్ చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. కమిషనర్ డానియేల్ జోసఫ్ మాట్లాడుతూ చెట్టు నరికివేతపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే, దీనిపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.



నన్నయ ఇన్‌చార్జి ఉపకులపతి ఎవరో?

దివాన్‌చెరువు, జూలై17: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతిగా ఎవరిని నియమిస్తారన్న విషయమై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నన్నయ విశ్వవిద్యాలయం వీసీ పదవికి ఆచార్య కె.పద్మరాజు గతనెల 30వ తేదీన చేసిన రాజీనామాను గవర్నర్ ఆమోదించారు. అయితే వెనువెంటనే పూర్తి వీసీని నియమించే వీలు లేకపోవడంతో ఇన్‌చార్జి వీసీ బాధ్యతలను ఎవరికి అప్పగిస్తారనే విషయం ఆసక్తికరంగా మారింది. సాధారణంగా ఏ విశ్వవిద్యాలయంలోనైనా వీసీ పదవి ఖాళీ అయిన సందర్భంలో ఆయా వర్సిటీ రెక్టారుకో, సమీప విశ్వవిద్యాలయం వీసీకో అదనపు బాధ్యతలు అప్పగించడం లేదా ఐఏఎస్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించడం జరుగుతుంటుంది. అయితే ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాల వీసీలు తమ పదవులకు రాజీనామాలు చేశారు. దీంతో ప్రత్యేకాధికారిని నియమిస్తారేమోనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నన్నయ విశ్వవిద్యాలయానికి రెక్టార్ లేనందున సీనియర్ ఆచార్యుడికి వీసీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తారన్న అభిప్రాయం కూడా ఉంది. నూతన వీసీ నియామకం కోసం నోటిఫికేషన్ జారీ, సెర్చ్ కమిటీ ఏర్పాటు, దరఖాస్తుల ఆహ్వానం, పరిశీలన వంటి ప్రక్రియలు పూర్తి అయ్యేందుకు కనీసం మూడు నెలల వ్యవధి పట్టవచ్చునని విద్యావేత్తలు అంటున్నారు. అంతవరకూ నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ఏలుబడిలోనే కొనసాగకతప్పదని తెలుస్తోంది. దీంతో నన్నయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న కొంతమంది సీనియర్ ఆచార్యులతోపాటు గతంలో ఇక్కడ పనిచేసి ప్రస్తుతం ఆంధ్రావిశ్వవిద్యాలయంలో బాధ్యతలు నిర్వహిస్తున్న ఒకరిద్దరు ఆచార్యులు ఇన్‌చార్జి వీసీ పదవికి తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నట్టు సమాచారం.

ఏడిఏ కార్యాలయం హుకుంపేటకు మార్పు

రాజమహేంద్రవరం రూరల్, జూలై17: రాజమహేంద్రవరం సబ్‌డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకుల కార్యాలయం రూరల్ మండలం హుకుంపేటలోని రైతు సేవా కేంద్రానికి బుధవారం మార్చినట్టు ఏడిఏ డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇప్పటివరకు ఈ కార్యాలయం రాజానగరం మండలం పరిధిలోని దివాన్‌చెరువులో ఉండేది. ఇక్కడ రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, కడియం మండలాలను చెందిన వ్యవసాయ సిబ్బంది హుకుంపేటలో అందుబాటులో ఉంటారు. వ్యవసాయానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామంటున్న ప్రభుత్వాలు వ్యవసాయశాఖ కార్యాలయానికి సొంత భవనం విషయం మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి చేరువలో భవన నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. గత ప్రభుత్వం హయాంలో కనీసం ఆ ఊసే లేదు. దీంతో గత పదేళ్లుగా అద్దె భవనాల్లోనే పలుచోట్ల ఈ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.



గౌతమి గ్రంథాలయంలో పురాతన గ్రంథాలు పరిశీలిస్తున్న కలెక్టర్

'గౌతమి'కి పూర్వ వైభవం తీసుకువద్దాం

నగరంలో ముఖ్య ప్రదేశాలను పరిశీలించిన కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, జూలై17: రాజమహేంద్రవరంలోని పలు ముఖ్యమైన ప్రదేశాలను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం పరిశీలించారు. ఇందులో భాగంగా గౌతమి గ్రంథాలయాన్ని పరిశీలించారు. గ్రంథాలయంలో ఉన్న పురాతన గ్రంథాలు, వాటి విశిష్టతను లైబ్రేరియన్ ఐ.శ్రీదేవి కలెక్టర్‌కు వివరించారు. తొలుత రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయానికి పూర్వవైభవం తీసుకువద్దామన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధంచేస్తే ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. అనంతరం దామెర్ల ఆర్ట్ గ్యాలరీని కలెక్టర్ పరిశీలించారు. అక్కడ ఉన్న తైలవర్ణ చిత్రాలను తిలకించారు. గ్యాలరీకి సంబంధించిన వివరాలను గ్యాలరీ ఇంచార్జి నాగేశ్వరరావు వివరించారు. అనంతరం టౌన్ హాలును పరిశీలించారు. 2027లో జరిగే పుష్కరాల నాటికి రాజమహేంద్రవరంలో పర్యాటకపరంగా దర్శనీయ స్థలాలు గుర్తించి, వాటి గుర్తింపు కోసం క్షేత్రస్థాయిలో పర్యటించి అధ్యయనం చేయడం జరుగుతుందని కలెక్టర్ చెప్పారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



నవదుర్గా సహిత కనకదుర్గ అమ్మవారికి భక్తులు సమర్పించిన సారె

నవదుర్గా ఆలయంలో అమ్మవారికి ఆషాడం సారె

తాళ్ళపూడి, జూలై 17: తాళ్ళపూడి మండలంలో తొలి ఏకదశి పర్వదినం సందర్భంగా దేవాలయాలు అన్నీ భక్తులతో కిటకిటలాడాయి. తాళ్ళపూడిలో ఉన్న నవదుర్గా సహిత కనకదుర్గమ్మ వారి ఆలయంలో ఆషాడమాసం తొలి ఏకాదశి సందర్భంగా అమ్మవారికి సారెను అందించారు. పలు గ్రామాల నుంచి విచ్చేసిన మహిళా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారికి సారె కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి దీవెలను అందుకున్నారు.

పేరుకుపోయిన వర్షం నీరు తొలగింపు

● పరిశీలించిన కొవ్వూరు సబ్ కలెక్టర్



అధికారులతో, పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

తాళ్ళపూడి, జూలై 17: మండలంలోని వేగేశ్వరపురం గ్రామంలో జిల్లా అధికారుల రాకతో మురుగునీరుపోయే మార్గం సుగమం అయ్యింది. గ్రామంలోని మేదర పేటలో చేరిన వర్షపు నీరు తొలగించేందుకు పంచాయతీవారు చేపట్టిన తాత్కాలిక పనులకు స్థానికులు కొంతమంది చేసిన ఫిర్యాదుమేరకు జిల్లా కలెక్టరు ప్రశాంతి జరిపిన ఆకస్మిక పర్యటనలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఎంపీడీవో వెంకటరమణ పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బంది చేపట్టిన పనులను కొవ్వూరు సబ్‌కలెక్టరు అశుతోష్ శ్రీవాస్తవ పనులను పరిశీలించారు. అత్యవసర పనులకు గ్రామ ప్రజలు అంతా సహకరించాలని తాత్కాలిక పనులకు అడ్డంకి కలిపించ వద్దని సబ్ కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఆర్ఐ కిషోర్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


'రజకులకు వృత్తిపరమైన చెరువులు కేటాయించాలి'



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కట్లయ్య

తాళ్ళపూడి, జూలై 17: తాళ్ళపూడి మండలంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య పర్యటించారు. తాళ్ళపూడిలో ఆయన మాట్లాడుతూ రజకుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక జీవోలు జారీ చేసినప్పటికీ అవి కిందస్థాయిలో అమలు కాకపోవడంపట్ల రజకులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ప్రతి గ్రామ పంచాయతీలోనూ రజకులకు వృత్తిపరమైన చెరువులను కేటాయించి దోభీఖానాలను కట్టించాలని అన్నారు. అనేక గ్రామాలలో రజకులు తమ న్యాయమైన హక్కులు పొందలేకపోతున్నారని రజకులను నేటికీ గ్రామాలలో చిన్నచూపు చూస్తున్నారని అది తగదని అన్నారు. రజకుల సంక్షేమం కోసం జీవో నెం. 62 ప్రకారం ప్రతి 3నెలలకు ఒకసారి జిల్లా కలెక్టరు అధ్యక్షతన సమావేశం ఏర్పాటుచేసి రజకులు సమస్యలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు గోపాలపురం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రజకులకు విశ్రాంతి భవనాలు కట్టించి ఇచ్చారని, అలాగే రజకుల అభివృద్ధికి ప్రతి నియోజక వర్గంలోనూ చర్యలు తీసుకోవాలని కోరారు. తాళ్ళపూడి మండల రజక సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి జనసేన సభ్యత్వాల నమోదు



● గోపాలపురం జనసేన ఇన్‌ఛార్జ్ సువర్ణరాజు

దేవరపల్లి, జూలై 17: జనసేనపార్టీ నాల్గవ విడత సభ్యత్వ నమోదు జూలై 18 నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తామని గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ సువర్ణరాజు అన్నారు. దేవరపల్లిలో బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ నాల్గవ విడత సభ్యత్వ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహిస్తామని తెలిపారు. 28వ తేదీ వరకు 10రోజుల పాటు సభ్యత్వ నమోదు చేస్తామని, ఆధార్‌కార్డు, నామిని ఆధార్ కార్డు, పాస్‌పోర్టుసైజు ఫొటోలు, రూ.500 సభ్యత్వ రుసుము చెల్లించాలని తెలిపారు. దేవరపల్లిలో బస్‌స్టాండ్‌వద్ద సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. నాలుగు మండలాలైన ద్వారకాతిరుమల, నల్లజర్ల, దేవరపల్లి, మండలాల్లో జనసేన పార్టీ అధ్యక్షుడు, గ్రామ పార్టీ అధ్యక్షుడు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడతారని తెలిపారు.

వర్షం కోసం గ్రామ దేవతకు సంబరాలు



అనంతపల్లిలో గ్రామదేవత గంగాభవానీ అమ్మవారి ఆలయంవద్ద పూజలు చేస్తున్న దృశ్యం

నల్లజర్ల, జూలై 17 : వర్షాలు కురవాలి పంటలు సమృద్ధిగా పండాలంటూ అనంతపల్లిలో గ్రామ దేవత దండుగంగాభవానీ అమ్మవారికి గ్రామపెద్దలు బుధవారం సంబరం నిర్వహించారు. ప్రతి ఏటా ఆషాడమాసంలో అమ్మవారికి చలిమోరు(అన్నం,పెరుగు)నైవేధ్యంగా సమర్పించి అనంతరం రైతులు దానిని ప్రసాదంగా స్వీకరిస్తారు. డప్పువాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించి చలిమోరు(అన్నం,పెరుగు)చలివిడి పానకాలు అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, మద్దిపాటి నరసింహరావు, వల్లిరెడ్డి సతీష్, కలం సత్యనారాయణ, బళ్ళ నాని, ప్రత్తి మురళి, శెట్టిపల్లి నాగరాజు, గొర్రెల సాంబ, పోకల నరసింహరావు,వీ.వీ.రాఘవులు పాల్గొన్నారు.

తీపర్రు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద రద్దీ

పెరవలి, జూలై 17: ఉచిత ఇసుక పంపిణీ విధానంలో సరళతరం చేయడంతో బుధవారం తీపర్రు ఉసులుమర్రు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద వాహనాల రద్దీ ఎక్కువైంది. నిన్నటివరకు ఇసుకకోసం ఆధారపడుతూ నిర్మాణాలకు సంబంధించిన ప్లాన్ కాగితాలు ఆయా పంచాయతీ కార్యదర్శి లెటర్లు తీసుకురావాలని నిబంధనలు ఉండటంతో రోజుకు కేవలం 5 నుంచి 10 లారీలు మాత్రమే ఉండేది. ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం కేవలం ఆధార్ ఉంటే చాలు అని చెప్పడంతో బుధవారం సుమారు 80 లారీల వరకు ఎగుమతి అయినట్లు స్టాక్ పాయింట్ ఇన్‌చార్జి సన్నిబాబు తెలిపారు.



తీపర్రు ఇసుక స్టాక్‌పాయింట్ వద్ద లారీలు

పాల్మీ రైతుల సమస్యలు పరిష్కరించాలని మంత్రి లోకేశ్‌కు వినతి

అనపర్తి, జూలై 17: ఏపిలో పౌల్ట్రీ పరిశ్రమ సంక్షోభంలో ఉందని కోళ్ళ రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం విజయవాడలో మంత్రి నారాలోకేశ్‌ను ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ పడాల సుబ్బారెడ్డి పౌల్ట్రీ రైతులు ఎ దుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించారని త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని సుబ్బారెడ్డి తెలిపారు.

కొవ్వూరు పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

● కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూలై 17: కొవ్వూరు పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పట్టణంలోని ప్రధాన వాటర్‌వర్క్సు నుంచి అచ్చాయమ్మకాలనీకి వెళ్లే ప్రధాన తాగునీటి పైపులైను కనెక్టవిటీ పనులను బుధవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావనరత్నకుమారి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావులు ప్రారంభించారు. ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ గోదావరి నుంచి తాగునీరు సుదూర ప్రాంతాలకు పైపులైన్ల ద్వారా తరలిస్తున్నారు. కానీ కొవ్వూరు పట్టణవాసులకు అందుబాటులో లేకుండా పోయిందన్నారు. గడచిన 5 సంవత్సరాలలో ప్రజా సమస్యలను ఎక్కడా పట్టించుకున్న దాఖలాలు లేవనడానికి కొవ్వూరు పట్టణమే ఉదాహరణ. ఎన్నికల ముందు డోర్ టు డోర్ ప్రచారానికి వెళ్లినప్పుడు ఇందిరమ్మకాలనీ, అచ్చాయమ్మకాలనీ, యానాదికాలనీ, సత్యవతినగర్‌వాసులు తాగునీరు అందడం లేదని వాపోయారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి సహకారంతో వాటర్‌ట్యాంకుల ద్వారా పంపిణీ చేశామన్నారు. తాగునీటి సమస్యలను పరిష్కరించడానికి మున్సిపల్ నిధులు రూ.10లక్షలతో మున్సిపల్ వాటర్ వర్క్సు పనులు ప్రారంభించామన్నారు. ఆర్ అండ్ బీ రహదారిని పగులగొట్టకుండా 8 అడుగుల లోతు గోతులు తవ్వి అండర్ గ్రౌండ్ పైపులైను పనులు చేపట్టామని 3రోజులలో పూర్తిచేస్తామన్నారు. గోదావరి జలాలను శుద్ధిచేసి కొవ్వూరు పట్టణంలోని 23 వార్డులకు తాగునీటి సమస్య లేకుండా పూర్తిస్థాయిలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో గోదావరి నదికి పుష్కరాలు రానున్నాయి దానిని దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని సమస్యలను పరిష్కరించి, కొవ్వూరు అభివృద్ధికిఅ అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, పొ ట్రు శ్రీనివాసరావు, ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, ఎం.రామచంద్రరావు, ఎం.వెంకటేశ్వరరావు, డేగల రాము, గంగుమళ్ళ స్వామి, పెనుమాక జయరాజు, తులసి, మురుకొండ శ్రీను, పాలడుగుల రమేష్, బర్ల శ్రీను, బొబ్బిలి పేర్రాజు, ఆకుల నగేష్, కిలారి రమణ, మద్దుకూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో తాగునీటి పైపులైను పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి

'వైసీపీ ప్రభుత్వ దోపిడీ, దందాపై విచారణ జరిపిస్తాం'

చాగల్లు, జూలై 17: వైసీపీప్రభుత్వంలో జరిగిన అక్రమాలు, దోపిడీ, దందాపై ఎన్‌డీఏ ప్రభుత్వం విచారణ జరిపిస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం కోసం శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. బుధవారం చాగల్లు విచ్చేసిన ఆయన టీడీపీ నాయకుడు నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి ఇంట్లో విలేఖరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల పాలనలో లక్షా 75వేల ఎకరాలు ఆక్రమణలు జరిగాయని, ఇళ్ల పట్టాలు పేరుతో పదివేల ఎకరాలు ఆక్రమణలు జరిగాయని చెపారు. ఇసుకలోను కోట్ల రూపాయలు దోపిడీ జరిగిందన్నారు. ఇసుక, మద్యం, సహజ సంపద దోపిడీపై విచారణ జరిపించి చట్టపరంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమలో టీడీపీ నాయ కులు నాదెళ్ళ శ్రీరామ్‌చౌదరి, తాళ్ళూరి హరిశ్చంద్రప్రసాద్, దొంగ రామక్రిష్ణ, ఈడుపుగంటి మురళి, బొడ్డు కేశవకుమార్, తాళ్ళూరి శ్రీను, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో భూదందాలు, సహజ వనరుల దోపిడీ



నల్లజర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

నల్లజర్ల, జూలై 17 : గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో భూదందాలు, సహజవనరుల దోపిడీ ఇష్టానుసారం జరిగిందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ఆరోపించారు. గురువారం నల్లజర్ల టీడీపీ కార్యాలయంలో ఆయన విలేఖర్లతో మాట్లాడారు. వైసీపీ పాలనపై సీఎం చంద్రబాబు 5 శ్వేతపత్రాలను విడదల చేసిందన్నారు. జగన్‌రెడ్డి ఏవిధంగా అక్రమాలు, దందాలుచేసి ఎంత దోచుకున్నారు ఆధారాలతో సహ బయటపెట్టామన్నారు. లక్షా75వేల ఎకరాల భూ అక్రమాలు జరిగాయని, వీటి విలువ రూ.35,576 కోట్లు ఉంటుందన్నారు. ఇళ్ల పట్టాల పేరుతో 10వేల ఎకరాలు, ఇసుక దందాలో రూ.9వేల750కోట్లు దోచుకున్నట్లు పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకుని వచ్చిన భయంకరమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జీవో 512ను దర్దు చేశా మన్నారు. హౌసింగ్ కాలనీ ఎక్కడ రావాలో ముందుగానే వైసీపీ నేతలు తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసి ప్రభుత్వానికి రెట్టింపు ధరలకు విక్రయించి నివాసయోగ్యం కాని స్థలాలను ఇళ్ల స్థలాలకు కేటాయించినట్లు చెప్పారు.గృహ నిర్మాణ శాఖకు సవరణల పేరుతో 98లక్షల టన్నుల ఇసుక మింగేసినట్లు పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానంవల్ల మళ్లీ రాష్ట్రంలో నిర్మాణ రంగ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.

'మొక్కలు నాటి సంరక్షించడంపై అవగాహన కల్పించాలి'

కొవ్వూరు, జూలై 17: చిన్నతనం నుంచి విద్యార్థులకు మొక్కలు నాటి సంరక్షించడంపై అవగాహన కల్పించాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మండలం కుమారదేవం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం మొక్కలునాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నా రు. సమస్యల పరిష్కారం కోసం అక్కడి నుంచే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎక్కడికక్కడ మొక్కలు నరికివేయడం వలన కాలుష్యం పెరిగి ప్రజలు అనారోగాల బారిన పడుతున్నారన్నారు. మొక్కలు నాటి సంరక్షించడం వలన పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునన్నా రు. కుమారదేవం బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎక్కువగా ఉండడంతో 4 అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని, విద్యార్థులకు తాగునీటికి సంబంధించి మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటుచేయాలని, ఇంటర్నల్ సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టాలని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కరెంటు పోయిన సమయంలో విద్యార్థుల సౌకర్యార్థం దాతల సహకారంతో ఇన్‌వర్టర్ ఏర్పాటుకు కృషిచేస్తానన్నారు. ఎస్సీ హాస్టల్ భవనాలు పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, వట్టికూటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ మేకల శ్రీను, కె.విజయలక్ష్మి, చావా శ్రీనివాసరావు, గౌరిజాల సురేష్, ఎంపీడీవో కె.సుశీల, సర్పంచ్ ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, సుంకర సత్తిబాబు, పెనుమాక తులసి, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కుమారదేవం గురుకుల పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ముప్పిడి



నిడదవోలులో మదనగోపాలస్వామి, మునిపల్లిలో శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి



దేవరపల్లిలో వెంకటేశ్వరస్వామి



ఉండ్రాజవరం వెంకటేశ్వరస్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా తొలి ఏకాదశి పూజలు

నిడదవోలు, జూలై 17: నిడదవోలు పట్టణంలో ఉన్న రుక్మిణి సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయంలో బుధవారం తొలిఏకాదశి (సయయ ఏకాదశి)కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామి అమ్మవార్లకు విశేష పూజలు అభి షేకాలు నిర్వహించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ మేనేజర్ నామా సూర్య ప్రకాశరావు తొలి ఏకాదశి పర్వదిన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లక్ష్మీ నారాయణ స్వామికి విశేష పూజలు

నిడదవోలు, జూలై 17: నిడదవోలు మండలం మునిపల్లి గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో బుధవారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి విష్ణు సహస్రనామం విశేష పూజలు నిర్వహించా రు. భక్తులు పెద్దఎత్తున స్వామివారిని దర్శించుకుని తీర్ధ ప్రసా దాలు స్వీకరించారు.

వైభవంగా స్వామివారి కల్యాణం

దేవర పల్లి, జూలై 17: తొలి ఏకాదశి సందర్భంగా దేవరపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు విశేషంగా నవకలశ స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలుచేసి సాయంత్రం స్వామివారి కల్యాణం నిర్వహించారు. మండలంలోని పల్లంట్ల గ్రామంలో రాజరాజేశ్వరి సమేత దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. రాజేశ్వరిదేవి అమ్మవారిని శాకాంబరి దేవిగా అలంకరణ చేశారు. తొలిఏకదశి సందర్భంగా బుధవారం దేవాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివార్లను, అమ్మవార్లను దర్శించుకున్నారు.

దేవాలయాల్లో ఆషాడం పూజలు



పల్లంట్లలో శాకంబరి అవతారంలో అమ్మవారు



ఉండ్రాజవరంలో శాకాంబరిగా ముత్యాలమ్మ

ఉండ్రాజవరం, జూలై 17: మండలంలో పలు దేవాలయాల్లో ఆషాడ మాసం పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక పూజలునిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసారు. పాలంగి కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందజేసారు. ఉండ్రాజవరం ముత్యాలమ్మ అమ్మవారిని శాకాంబరి మాతగా కూరగాయలతో అలంకరించారు. పూజలు జరిపారు. గ్రామాల్లో తొలిఏకాదశి ప్రజలు ఆలయాల్లో పూజలు జరిపారు. ఉండ్రాజవరంలో భూసమేత వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు, మహిళా భక్తులు విష్ణు సహస్ర నామ పారాయణం చేసారు. ప్రసాదాలు అందజేసారు.

నల్లజర్ల : తొలి ఏకాదశి పర్వదినం పురష్కరించుకుని నల్లజర్ల మండలంలో పలు గ్రామాల్లో ఏకహా మహోత్సవాలు నిర్వహించారు. గురువారం ఉదయం ఆరుగంటల నుంచి టీడీపీ నాయకులు కూసంపూడి వెంకటేశ్వరరావు(బుజ్జీ)ఆధ్వర్యంలో ఏకాహ ఉత్సవాలు ప్రారంభించారు. 24గంటలపాటు భజన సంకీర్తనలతో భక్తులు అలరించారు. శుక్రవారం 6గంటల వరకు భజన సంకీర్తన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. రైతులకు తొలి పండుగ కావడంతో నూతనంగా వేసిన మోటార్ బోరులు ప్రారంభించి నాట్లు వేశారు.

రిటైర్డ్ ఎంప్లాయిస్ సమస్యలు పరిష్కరించాలి

● జిల్లా కార్యవర్గ సమావేశం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాశరావు

తాళ్ళపూడి, జూలై 17: ఏపీ స్టేట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ జిల్లా కార్యవర్గ సమావేశం తాళ్ళపూడి మండలం వేగేశ్వరపురంలోని ఉన్నత పాఠశాలలో ఆవరణలో ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా ప్రధాన కార్యదర్శి బండి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఏపీ స్టేట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని గత ప్రభుత్వంలో ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించే విధంగా ప్రతినెలా ఒకటోతేదీన పెన్షన్ అందజేయాలని కేంద్ర ప్రభుత్వం ద్వారా అందించే డీఏ త్వరగా ఇవ్వాలని మెడికల్ ఖర్చుల కింద ప్రభుత్వం అందించే మొత్తాన్ని 5 లక్షలకు పెంచాలని 12వ పీఆర్‌సీని త్వరగా ప్రకటించాలని పెన్షనర్ చనిపోయిన సమయంలో మట్టి ఖర్చుల కింద ఒకనెల పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఓ తీర్మానాన్ని సంఘం తరుపున ప్రభుత్వానికి నివేదిస్తున్నట్లు తెలిపారు. అనంతరం యూనియన్ తరపున ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో డా. అగర్వాల్ కంటి వైద్యులు, సాయిరాం డెంటల్ వైద్యులు, మోహన్ డయాబెటిక్ సెంటర్ వైద్యులు శిబిరానికి వచ్చిన రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బి.సత్యప్రసాద్, వి.చంద్రయ్య, ఎం.నాగేశ్వరరావు పలు మండలాల నాయకులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొనడంతో విరిగిపోయిన గడ్డర్



నిడదవోలులో వాహనం ఢీకొనడంతో విరిగిపోయిన గడ్డర్

నిడదవోలు, జూలై 17: నిడదవోలు పై ఓవర్ బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన ఐరన్ గడ్డర్‌ను గుర్తు తెలియని వాహనాలు ఢీ కొనడం పరిపాటిగా మారింది. నిడదవోలు నుంచి రాజమహేంద్రవరం, రాజమహేంద్రవ రం నుంచి నిడదవోలువైపు వచ్చే భారీ వాహనాలు నియంత్రణకు వేసిన గడ్డర్‌లను ఇప్పటికే కొన్నిసార్లు వాహనాలు ఢీ కొన్నాయి. బుధవారం నిడదవోలు పట్టణంవైపు ఉన్న ఐరన్ గడ్డర్‌ను వాహనం ఢీకొనడంతో గడ్డర్ వేలాడుతూ ప్రమాదం అంచున నిలిచింది. పోలీసులు తక్షణం చర్యలు చేపట్టారు. గడ్డర్‌ను ఢీ కొడుతున్న వాహనాలపై కేసులు నమోదు చేయాలని పలువురు వాహనదార్లు కోరుతున్నారు.

'సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి'



సమావేశంలో మాట్లాడుతూ బల్లభద్ర వెంకట రాజు

నల్లజర్ల, జూలై 17 : ప్రస్తుతం ప్రజలను పట్టి పీడిస్తున్న సీజనల్ వ్యాధులపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని రాజమహేంద్రవరం ప్రముఖ న్యూరో వైద్యుడు బల్లభద్ర వెంకటరాజు అన్నారు. గురువారం నల్లజర్ల ఏకేఆర్‌సీ కళాశాలలో దేవరపల్లి, నల్లజర్ల సర్వసభ్య సమావేశం నల్లజర్ల పీఎంపీ అధ్యక్షుడు బోడిగడ్ల సీతారాముల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట రాజు మాట్లాడుతూ గ్రామీణా ప్రజానీకానికి గ్యాస్‌నొప్పికి గుండె నొప్పికి తేడా తెలియడంలేదని అదేవిధంగా గుండె నొప్పివస్తే గ్యాస్ నొప్పి అని నిర్లక్ష్యం వహించడం ద్వారా ప్రాణాలను కోల్పోతున్నారని చెప్పారు. ప్రజలకు గ్యాస్ నొప్పి లక్షణాలు, గుండె నొప్పి లక్షణాలపై అవగాహన కల్పించాలన్నారు. పీఎంపీలు సమాజానికి మేలు చేసే విధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బల్లభద్ర రాఘవీర్, డాక్టర్ వినోద్‌కుమార్, పీఎంపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.బీ.టీ రాజు, జిల్లా అధ్యక్షుడు బళ్ళ శ్రీను, జిల్లా కోశాధికారి పి .చిన్ని, పీఎంపీలు కటుంబరావు, నల్లజర్ల మురళి, వెంకటరత్నం, బ్రహ్మం పాల్గొనారు.

కోడిపందాలపై పోలీసుల దాడి

● 14ద్విచక్ర వాహనాలు స్వాధీనం

● 8మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

గోపాలపురం, జూలై 17: మండలంలోని వేలచింతలగూడెం గ్రామ శివారులో కోడిపందాలు నిర్వహిస్తున్నారని వచ్చిన రహస్య సమాచారం మేరకు తన సిబ్బందితో దాడి చేసినట్లు ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం కోడిపందాలు నిర్వహిస్తున్నారని తనకు సమాచారం అందిందన్నారు. దీంతో తన సిబ్బందితో దాడి చేయగా 8మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రెండుకోళ్ళు, రెండు కోడికత్తులు, రూ.12,175 నగదుతోపాటు, 14ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఏపీ పెన్షనర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై 17: స్థానిక ప్రకాశంనగర్ ధర్మంచర హాలులో బుధవారం ఏపీ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ 49వ వార్షికోత్సవ సభ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెన్షనర్లు ఆర్థికంగా చాలా నష్టపోయారని, ఇప్పుడు కొత్తగా వచ్చిన ప్రభుత్వం, గతంలో పెన్షనర్లకు జరిగిన నష్టాన్ని అంచలంచెలుగా సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చారని, ఉద్యోగ సంఘ నాయకులతో చర్చలకు సంసిద్ధత వ్యక్తం చేసిందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాస్ మాట్లాడుతూ రాజమహేంద్ర వరంలో 3500 మంది పెన్షనర్లు ఉండటం చాలా ఆనందదాయకమన్నా.రు. నగర అధ్యక్షులుగా కె.కె.సంజీవరావు, సహాధ్యక్షులుగా కొండపల్లి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు గా జి.శేషగిరి రావు, అడ్డా వెంకటరాజు, కనకం చంద్రశేఖర్, మట్టపర్తి సత్యనారా యణ, కె.ఎన్.వి. ప్రసాద్, మొల్లేటి సత్యనారాయణ, కోశాధికారిగా ఎస్‌కెవీఎస్‌రాజు ఎన్నికయ్యారు.

నేడు ఎస్వీ రంగారావు సంస్మరణ సభ

రాజమహేంద్రవరం సిటీ, జూలై 17: తెలుగు చలన చిత్రసీమాలో విభిన్నమైన పాత్రలు పోషించి ప్రేక్షకలోకాన్ని మెప్పించిన మహానటుడు ఎస్వీ రంగారావు 50 వర్ధంతిని పురస్కరించుకుని రాజమహేంద్రవరం జిత్ మోహన్‌మిత్రా కళా వేదికలో గురువారం సాయంత్రం సంస్మరణ సభ నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు, రాజకీయ విశ్లేషకుడు అడబాల మరిడయ్య తెలిపారు. ఈ సభకు ప్రముఖ గాయకుడు నటుడు జిత్ మోహన్ మిత్రా అధ్యక్షత వహిస్తారని, ముఖ్యఅతిధిగా చాంబర్ ఆప్ కామర్స్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, సాకినేని మల్లికార్జునరావు, ఎన్ గోవింద్ హజరవుతారని తెలిపారు. కళాకారులు ,అభిమానులు ఈ సభకు హజరుకావాలని సుక్కిరెడ్డి శ్రీనివాసరావు, అనిశెట్టి ఆనంద్, అడబాల మరిడయ్యలు విజ్ఞప్తి చేశారు.

పలు ప్రజా సమస్యలు పరిష్కారం

కోరుకొండ, జూలై 17: రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ బుధవారం కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం నుంచి తరలివచ్చిన ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాలకు చెందిన పలు గ్రామాల నుంచి వందల సంఖ్యలో ప్రజలు తరలివచ్చి ఎమ్మెల్యేకు తమ సమస్యల అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు డాక్టర్ అడపా శ్రీనివాస్, మేడిశెట్టి శివరాం, దేవన దుర్గాప్రసాద్, యర్రంశెట్టి పోలారావు, నాతి పాము దొరబాబు, బత్తుల గోపాలకృష్ణ, బదిరెడ్డి దొర, తదితరులు పాల్గొన్నారు.